RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD సంపుటి : 10 సంచిక : 347 శనివారం 19 - 07 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

### ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ పాలనలోనే

# ఎక్కువ అన్యాయం జరిగింది

- నాగర్‌కర్నూల్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- కొల్లాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల
- చెక్కులు సీఎం పంపిణీ చేశారు
- శ్రీశైలం నిర్మాణంలో పాలమూరు బిడ్డలు నిర్వాసితులుగా
- మారారని రేవంత్ రెడ్డి వాపోయారు
- పాలమూరు జిల్లా ప్రజలు కేసీఆర్‌కు అన్నం పెడితే,ఆయన మాత్రం ఇక్కడి ప్రజలకు సున్నం పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు
- కేసీఆర్ నిర్లక్ష్యానికి పాలమూరు జిల్లా ఎడారిగా మారి లక్షలాదిగా వలసపోయారన్నారు
- కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, కానీ అది మూడేళ్లలోనే కూలేశ్వరమైందని సీఎం ఎద్దేవా చేశారు
- పదేళ్ల పాలనలో పాలమూరు ప్రాంతానికి ఏమీ చేయలేదని విమర్శ
- కేసీఆర్‌కు మద్దతివ్వడానికి శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డిలకు సిగ్గుండాలన్న రేవంత్ రెడ్డి



పాలమూరు జిల్లా ప్రజలు కేసీఆర్‌కు అన్నం పెడితే. ఆయన మాత్రం ఇక్కడి ప్రజలకు సున్నం పెట్టారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. నాగర్ కర్నూలు జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొల్లాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా పెంట్లవల్లి మండలం జటప్రోలు మదన గోపాలస్వామి ఆలయం సందర్శించిన సీఎం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన తరువాత స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం జటప్రోలులోనే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు.కేసీఆర్ హయాంలోనే ఎక్కువ ద్రోహం : శ్రీశైలం నిర్మాణంలో పాలమూరు బిడ్డలు నిర్వాసితులుగా మారారని రేవంత్ రెడ్డి వాపోయారు. జీవో 98 ప్రకారం ముంపునకు గురైన పేదలను ఆదుకోలేదని, పాలమూరు సమస్యలు పరిష్కరించి ఉంటే ఇక్కడి వారంతా వలస వెళ్లే పరిస్థితే వచ్చే పరిస్థితి వచ్చేది కాదన్నారు. కేసీఆర్ నిర్లక్ష్యానికి పాలమూరు జిల్లా ఎడారిగా మారి లక్షలాదిగా

- మిగతా 2 లో

## హైడ్రో ప్రాజెక్టును సందర్శించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి



- రాష్ట్రంలోని హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై పై సమీక్ష నిర్వహించారు
- అన్ని హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టులలోని అన్ని యూనిట్లు వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు
- పవర్ ప్రాజెక్టు యూనిట్లు ఆలస్యం కాకుండా చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం ఉండవద్దని, అన్ని ప్రాజెక్టుల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు

రాష్ట్రంలోని అన్ని హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టులలోని అన్ని యూనిట్లు వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ,ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా, నాగార్జునసాగర్ జెన్కో

- మిగతా 2 లో

## త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం



2 లో

పీవీ నరసింహారావు హయాం నుంచి వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక పోరాటాలు

మీడియాతో మాట్లాడుతూ కోచ్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కాబోతుందని తెలిపారు

రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ 60 శాతం పనులు పూర్తి అయ్యాయని అన్నారు

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనుల పురోగతిని పరిశీలిస్తారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు

## ఢిల్లీలో 20కి పైగా స్కూళ్లకు బాంబు బెదిరింపులు

- స్కూళ్ల వద్ద బాంబు స్క్వాడ్స్ తనిఖీలు
- పాఠశాల తరగతి గదుల్లో పేలుడు పరికరాలంటూ బెదిరింపు మెయిల్స్
- పేలుడు పదార్థాలను నల్లటి ప్లాస్టిక్ సంచులలో పెట్టినట్లు లేఖ
- ఢిల్లీలో బెదిరింపు మెయిల్స్ రావడం వారంలోనే ఇది మూడోసారి
- మీలో ప్రతి ఒక్కరినీ నేను ఈ ప్రపంచం నుంచి తుడిచివేస్తాను అని లేఖలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు



దేశ రాజధాని ఢిల్లీలోని 20కి పైగా పాఠశాలలకు ఢిల్లీలో ఈ రోజు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో ఆయా స్కూళ్ల వద్ద బాంబు స్క్వాడ్స్ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన స్కూళ్లలో సివిల్ లైన్స్‌లోని సెయింట్ గ్జావియర్స్, పశ్చిమ్ విహార్‌లోని రిచ్‌మండ్ గ్లోబల్ స్కూల్, రోహిణిలోని అభినవ్ పబ్లిక్ స్కూల్, ద సావిరిన్ స్కూల్ ఉన్నాయి.పోలీసుల కథనం ప్రకారం, బాంబు బెదిరింపు లేఖలో... "హలో. నేను పాఠశాల తరగతి గదుల్లో అనేక పేలుడు పరికరాలను (ట్రినిట్రోటోలుయెన్) ఉంచానని మీకు తెలియజేస్తున్నాను. పేలుడు పదార్థాలను నల్లటి ప్లాస్టిక్ సంచులలో చాలా జాగ్రత్తగా దాచిపెట్టాను. మీలో ప్రతి ఒక్కరినీ నేను ఈ ప్రపంచం

- మిగతా 2 లో

## భారత నౌకాదళంలో చేరిన డీప్ సీ రెస్క్యూ నౌక 'నిస్తార్'



2 లో

స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మితమైన ఐఎన్ఎస్ నిస్తార్

హిందూస్థాన్ షిప్ యార్డ్ ద్వారా నిర్మితం

విశాఖలో నౌకాదళంలో చేరిక

నౌక దాదాపు 10,000 టన్నుల బరువు, 118 మీటర్ల పొడవు కలిగి ఉంది

'నిస్తార్' అనే పేరు సంస్కృతం నుండి వచ్చింది, దీని అర్థం 'విముక్తి' లేదా 'రక్షణ'

## ఆపరేషన్ సిందూర్ దెబ్బ రెండు నెలలుగా ఎయిర్‌పోర్టు మూసివేత




పహల్గామ్ దాడి నేపథ్యంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఆపరేషన్ జరిగి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్ వద్ద ఉన్న రన్‌వే ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు. ఈ ఎయిర్‌పోర్టు మూసివేతను మూడోసారి పొడిగించింది. ఆగస్ట్ 5 వరకు రన్‌వే మూసివేసి ఉంటుందని పాకిస్థాన్ తాజాగా నోటమ్

- మిగతా 2 లో

- రెండు నెలల గడుస్తున్నా తెరుచుకోని రహీమ్ యార్ ఖాన్ ఎయిర్‌బేస్
- ఆగస్ట్ 5 వరకు రన్ వే మూసి ఉంటుందని వెల్లడి
- ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మే 10న భారత్ దాడి చేసిన నేపథ్యంలో తొలి నోటమ్ జారీ
- గత నెల నాలుగో తేదీన రెండో నోటమ్ జారీ చేసింది.
- తాజాగా ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగించింది

## 22 ప్రాజెక్టులతో 30,899 ఉద్యోగాలు



సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ ఎస్ఐపీబీ సమావేశం

హాజరైన లోకేశ్, అచ్చెన్నాయుడు, కేశవ్, టీజీ భరత్, అనగాని తదితరులు

మొత్తం 22 ప్రాజెక్టుల ద్వారా 30,899 మందికి ఉద్యోగ అవకాశాలు

ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన, పర్యాటక రంగాలకు సంబంధించిన రూ.39,473 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది

రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల చుట్టూ సంబంధిత ఎకో సిస్టం వచ్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎకో సిస్టం ద్వారా ఆయా ప్రాజెక్టులతో పాటు స్థానికులు, అనుబంధ సంస్థలకూ లబ్ధి కలుగుతుందని సీఎం స్పష్టం చేశారు. గురువారం నాడు సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 8వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, కె.అచ్చెన్నాయుడు, పయ్యావుల

- మిగతా 2 లో

### ఆంధ్రప్రదేశ్‌ను

# హైడ్రోజన్ వ్యాలీగా తయారు చేస్తాం

- రెండ్రోజుల్లో అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్
- అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్
- ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు
- హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు
- గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోధనలు చేయాలని, ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు
- గ్రీన్ హైడ్రోజన్ ను తక్కువ వ్యయంతోనే ఉత్పత్తి చేసేలా కొత్త సాంకేతికను అభివృద్ధి చేయాలని సీఎం స్పష్టం
- గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగిందని వెల్లడి
- గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలని చంద్రబాబు పిలుపు



హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గ్రీన్ హైడ్రోజన్ పై పరిశోధనలు చేయాలని, ఆ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అందుకు తగిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామని సీఎం స్పష్టం చేశారు. శుక్రవారం నాడు అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ లో ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం చంద్రబాబు ప్రసంగించారు. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా నూ తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి అన్నారు. రెండు రోజుల సదస్సు అనంతరం అమరావతి గ్రీన్ హైడ్రోజన్ డిక్లరేషన్ ను ప్రకటిస్తామని, ఏడాది తర్వాత డిక్లరేషన్ అమలుపై సమీక్షిస్తామని సీఎం వెల్లడించారు. గ్రీన్ హైడ్రోజన్ ను తక్కువ వ్యయంతోనే ఉత్పత్తి చేసేలా కొత్త సాంకేతికను అభివృద్ధి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈమేరకు యూనివర్సిటీలు, పరిశోధకులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ అంశంపై

- మిగతా 2 లో

## అమరావతి ఓఆర్ఆర్ పనుల్లో వేగం భూసేకరణకు రూ.5,300 కోట్లు!



అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు భూసేకరణపై ఎన్‌హెచ్ఏఐ కసరత్తు

140 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం

భూసేకరణ, అటవీ భూముల కోసం రూ.5,300 కోట్ల భారీ వ్యయం అంచనా

ఐదు జిల్లాల్లో 3,400 హెక్టార్ల భూమి, 250 హెక్టార్ల అటవీ భూమి అవసరం

189 కి.మీ. ప్రాజెక్టును 8 నుంచి 10 ప్యాకేజీలుగా చేపట్టే యోచన

కృష్ణా నదిపై రెండు భారీ వంతెనల నిర్మాణానికి ప్రణాళిక

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి మణిహారంలా భావిస్తున్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణ పనుల్లో కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ వేగవంతం చేసింది.

- మిగతా 2 లో

# సంపాదకీయం

## వ్యవస్థ దోషాన్ని విద్యార్థులపై నెడతారా






ప్రతి సంవత్సరం ఏదో ఒక సర్వే ద్వారా – మన రాష్ట్రం లోని విద్యార్థులు తెలుగు చదవలేరని, లెక్కలు చేయలేరని, 75 శాతం మంది తొమ్మిదవ తరగతి విద్యార్థులకు శాతాలు చేయడం తెలియదని, ఆరవ తరగతి పిల్లలకు కూడికలు తీసివేతలు రావట్లేదనీ... ఇలా పత్రికల్లో ప్రధాన శీర్షికలు కనిపిస్తుంటాయి. కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన తాజా సర్వే కూడా ఇలాంటి ఫలితాలనే వెల్లడించింది. తర్వాత ఎప్పటి మాదిరిగానే పరిస్థితిని గాడిలో పెట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కేంద్ర విద్యాశాఖ ప్రకటించింది. తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువులో రాణించడం లేదని, జాతీయ స్థాయి సగటు కంటే వెనుకబడి ఉన్నారని ఈ సర్వేలో తేలింది. మూడవ తరగతిలో ప్రైవేటు పాఠశాలకు ప్రభుత్వ పాఠశాలకు పెద్దగా తేడా లేకున్నా 6, 9 తరగతులలో ప్రైవేటు పాఠశాలలు అన్ని సబ్జెక్టులలోనూ సరాసరి 15 పాయింట్ల తేడాతో ముందున్నాయి. అసలు ఎవరీ చదువులో వెనుకబడుతున్న పిల్లలు అన్న ప్రశ్న వేస్తే సమాధానాలు మరింత నిర్దిష్టంగా లభించవచ్చు. ఈ సర్వేలో వివిధ సామాజిక వర్గాల పిల్లల సామర్థ్యాలను ప్రత్యేకంగా క్రోడీకరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల అన్ని సబ్జెక్టుల సామర్థ్యాల సరాసరి కేవలం 40 పాయింట్లతో 60 శాతం మంది వెనుకబడి ఉన్నారు. ఈ పిల్లలు వెళ్ళే పాఠశాలలు ఎలా ఉన్నాయి, బోధన ఎలా ఉంది, అడవి ప్రాంతంలో గిరిజన బిడ్డలు వెళుతున్న బడులు ఎలా ఉన్నాయి, పట్టణ ప్రాంతాలలో బస్తీలలో ఉన్న బడులు ఎలా ఉన్నాయి... ఇవేవీ పరిగణించకుండా పిల్లల విద్యా సామర్థ్యాలను పరీక్షించి విద్యార్థులను దోషులుగా నిలబెట్టడం శోచనీయం. అన్ని సర్వేలూ పిల్లలకు చదువు రావటం లేదంటూ వారినే దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయే గానీ, ఈ దుస్థితి కారణం వ్యవస్థాపరమైన లోపాలేనని ఏ ఒక్క సర్వే చెప్పడం లేదు. విద్యా హక్కు చట్టం ఆదేశించినట్లుగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా, తగినంత మంది టీచర్లను పాఠశాల స్థాయిలో అందుబాటులో ఉంచకుండా, ఉన్న టీచర్లకు తగిన బోధనా సమయాన్ని కేటాయించకుండా విద్యార్థులకు ఈ మూల్యాంకనం చేయడంలో అర్థం లేదు. ఉపాధ్యాయులు ఉన్నట్లుగానే అనిపించినా వారు మెటర్నటీ లీవ్, మెడికల్ లీవ్, ఎడ్యుకేషన్ లీవ్‌లో ఉన్న పాఠశాలలు, వీటితోపాటు ఏకోపాధ్యాయ టీచర్లు ఉన్న పాఠశాలలు... ఇలాంటి లోటుపాట్లను వెలికితీయడానికి సర్వేలు నిర్వహించాలి. సెలవులలో వెళ్ళిన టీచర్ల స్థానంలో మరో టీచర్‌ను నియమించే విధానమే లేని వ్యవస్థ మనది. చాలాసార్లు సబ్జెక్ట్ టీచర్లు లేకుండానే విద్యా సంవత్సరాలు గడిచిపోతుంటాయి. రాష్ట్రంలో 5985 ఏకోపాధ్యాయ పాఠశాలలలో దాదాపు 88,429 మంది విద్యార్థులు నమోదు అయినట్లు గణాంకాలు ద్వారా తెలుస్తున్నది. ఏకోపాధ్యాయ పాఠశాలలు అంటే విద్య లేదనే అర్థం చేసుకోవాలి. ఆ ఒక్క టీచరు ఉన్నా లేనట్లే అన్నది అందరికీ తెలిసిన విషయమే. అలాగే రాష్ట్రంలో 70 శాతం స్కూల్స్ (12,760) మూడు కంటే తక్కువ గదులతో ఉన్నాయి. అంటే రెండు మూడు తరగతుల విద్యార్థులను కలిపి కూర్చోపెడుతున్నారు. ఒకే తరగతిలో ఒకే క్లాస్ పిల్లలు కూర్చుంటేనే బోధన చేయడం అంతంత మాత్రం. అలాంటిది ఈ మిశ్రమ తరగతి గదులలో బోధన ఇంకెంత గొప్పగా ఉంటుందో ఊహించటం కష్టం కాదు! విద్యార్థులకు నిర్వహించే మూల్యాంకనం మీద ఈ పరిస్థితి ప్రభావం పడనే పడుతుంది. 25 శాతం స్కూళ్లలో మూత్రశాలలు లేవని నివేదికలు చెపుతున్నాయి. ప్రతి రోజు మీడియా ద్వారా కూడా తెలుస్తూనే ఉంది. ఇలాంటి పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులకు మూల్యాంకనం నిర్వహించి, వీరి సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయని వెల్లడించడం హాస్యాస్పదమే. అలాగే ఈ పాఠశాలలన్నీ వెనుకబడిన వర్గాల కుటుంబాలు నివసించే ప్రాంతాలేనన్నది ఇక్కడ గమనార్హం. పిల్లలందరికీ నాణ్యమైన విద్యా సామర్థ్యాలు అందించడం సమానత్వానికి, సమన్యాయానికి సంబంధించిన విషయం. అందరికీ సమానమైన విద్యను అందించాలనే రాజ్యంగ మూల సూత్రాలకు సంబంధించిన అంశం. అసమానమైన విద్యా వ్యవస్థలను నెలకొల్పి విద్యార్థులు అందరికీ ఒకే రకమైన మూల్యాంకనయం చేయడం సమన్యాయ సూత్రాలకు విరుద్ధమే! విద్యార్థులు అందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే వారు వెనుకబాటుతనం నుంచి బయటపడి గౌరవప్రదమైన జీవనం సాగిస్తారు. ఇంత ముఖ్యమైన అంశం ఎప్పుడూ ప్రధాన రాజకీయ చర్చకు రాకపోవడం విచారకరం. రాష్ట్రంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే తరం ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అత్యధిక శాతం పౌరులు చదవడం రాయడం రాని, బడికెళ్లిన నిరక్షరాస్యులుగా, నైపుణ్యాలు లేని కార్మికులుగా మిగిలిపోతారు. ప్రతిసారీ పిల్లల మీద మూల్యాంకనం చేసి వారిని దోషులుగా నిలబట్టే కన్నా విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలు ఈ పరిస్థితికి కారణం అని గమనించి విద్యా వ్యవస్థను పటిష్టం చేయవలసిన చట్టబద్ధ బాధ్యత ప్రభుత్వాలకు ఉన్నది.

## చంద్రబాబూ మా ప్రాజెక్టులను అడ్డుకోకండి

మొదటిపేజీ తరువాయి – వలసపోయారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టకుండా అన్యాయం చేశారని సీఎం మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయం కంటే, కేసీఆర్ హయాంలోనే ఎక్కువ ద్రోహం జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. డిసెంబర్ 9లోగా భూసేకరణ : జిల్లాకు మరో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే 20 లక్షల ఎకరాలకు నీళ్లు వచ్చేవన్నారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారని, కానీ అది మూడేళ్లలోనే కూలేశ్వరమైందని ఎద్దేవా చేశారు. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని సభలో ప్రకటించిన రేవంత్ రెడ్డి, డిసెంబర్ 9లోగా సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ చేపడతామన్నారు. నిర్వాసితులకు గత ప్రభుత్వాల తరహాలో మొండిచేయి చూపకుండా పరిహారం ఇచ్చి రెండేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సభలో హామీ ఇచ్చారు. అలాగే అత్యంత వెనుకబడిన కొల్లాపూర్ ప్రాంతానికి అండగా ఉంటామని, ఆ దిశగా అవసరమైన సహాయ కార్యక్రమాలు చేపడతామని రేవంత్ రెడ్డి స్థానికులకు హామీ ఇచ్చారు. కొల్లాపూర్ అభివృద్ధిపై మంత్రి దామోదర రాజనర్సింహాతో సమీక్షించాక చర్యలు తీసుకుంటామన్నారు.

## ఢిల్లీలో 20కి పైగా స్కూళ్లకు బాంబు బెదిరింపులు

మొదటిపేజీ తరువాయి – నుంచి తుడిచివేస్తాను. ఒక్క ఆత్మ కూడా బ్రతకదు. నేను ఆ వార్తలను చూసినప్పుడు సంతోషంగా నవ్వుతాను. తల్లిదండ్రులు పాఠశాలకు రావడం.. వారి పిల్లల ఛిద్రమైన శరీరాలను చూసి ఏడవడం చూస్తాను. మీరందరూ బాధపడటానికి అర్హులు. నాకు నిజంగా నా జీవితం అసహ్యమే. తర్వాత నేను ఆత్మహత్య చేసుకుంటాను. నా గొంతు కోసుకుంటాను, నా మణికట్టును కోసుకుంటాను. నాకు నిజమైన సహాయం ఎప్పుడూ అందలేదు. మనోరోగ వైద్యులు, మనస్తత్వవేత్తలు ఇలా ఎవరూ పట్టించుకోలేదు. ఎవరూ పట్టించుకోరు కూడా. నిస్సహాయ మానవులకు మందులు ఇవ్వడం గురించి మాత్రమే మీరు శ్రద్ధ వహిస్తారు. ఆ మందులు మీ అవయవాలను నాశనం చేస్తాయని, బరువు పెరగడానికి కారణమవుతాయని మనోరోగ వైద్యులు మీకు ఎప్పుడూ చెప్పరు. మానసిక మందులు వారికి సహాయపడతాయని మీరు ప్రజలను ఆలోచించేలా చేస్తారు. కానీ వారు అలా చేయరు. వారు అలా చేయరనడానికి నేను ప్రత్యక్ష రుజువును. మీరందరూ దీనికి అర్హులు. మీరు నాలాగే బాధపడటానికి అర్హులు" అని లేఖలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, బుధవారం కూడా సుమారు ఏడు స్కూళ్లకు బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఢిల్లీలో బెదిరింపు మెయిల్స్ రావడం వారంలోనే ఇది మూడోసారి. మంగళవారం ఉదయం నార్త్ క్యాంపస్‌లో ఉన్న సెయింట్ స్టీఫెన్స్ కాలేజీ, ద్వారకలోని సెయింట్ థామస్ స్కూల్‌కు బెదిరింపులు వచ్చాయి.

# ఆంధ్రప్రదేశ్‌ను హైడ్రోజన్ వ్యాలీగా తయారు చేస్తాం

మొదటిపేజీ తరువాయి – సీఎం మాట్లాడుతూ..."గ్లోబల్ వార్మింగ్ దృష్ట్యా గ్రీన్ హైడ్రోజన్ ప్రాధాన్యం పెరిగింది. పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాలి. 2070 నాటికి కర్బన రహిత ఇంధనాలు వాడాలన్నది మన జాతీయ లక్ష్యం. తక్కువ ఖర్చుతో హరిత విద్యుత్ తయారీ, స్టోరేజ్?పై దృష్టి సారించాలి. కేంద్రం కూడా గ్రీన్ హైడ్రోజన్? పరిశోధన, ఉత్పత్తికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకునేందుకు ఏపీ ఎప్పుడూ ముందు ఉంటుంది. ఇంధన ఖర్చు తగ్గాలి ప్రజలకు ప్రయోజనం చేకూరాలన్నదే ముఖ్యం. గ్రీన్ హైడ్రోజన్?తో అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఇవ్వడం సాధ్యం. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంగా ప్రధాని నిర్ణయించారు. గ్రీన్ హైడ్రోజన్ తయారీ లక్ష్యంలో ఏపీ ప్రముఖ భాగస్వామిగా ఉంటుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**గ్రీన్ హైడ్రోజన్... గేమ్ ఛేంజర్**

ఇంధన రంగంలో ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేలా పరిశోధనలు చేసి పరిష్కారం అన్వేషించాలని పరిశోధకులకు సీఎం పిలుపునిచ్చారు. సంప్రదాయ ఇంధన వనరుల కారణంగా తీవ్రమైన కాలుష్యం బారిన పడుతున్నామని నెట్ జీరో కార్బన్ లక్ష్యాల సాధనకు గ్రీన్ హైడ్రోజన్ లాంటి ఇంధనమే సరైన పరిష్కారమని సీఎం అన్నారు. ఇక సమీప భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్ దేనని. ఇంధన రంగంలో అది గేమ్ ఛేంజర్ గా మారుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే తక్కువ ఖర్చుతో సామాన్యులు కూడా వ్యయం భరించేలా ఉండే దీనిని ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఏపీలోనూ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. విశాఖలో ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ హైడ్రోజన్ తయారు చేసేందుకు ప్లాంట్ ను ఏర్పాటు చేస్తోందని అన్నారు. అలాగే కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందన్నారు.

**గ్రీన్ హైడ్రోజన్ , గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సీఎం సమక్షంలో రూ.51 వేల కోట్లకు ఒప్పందాలు**

ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ , గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు రెండు సంస్థలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో సదస్సు వేదికగా ట్రాన్స్‌ఫర్మేటివ్ అవగాహనా ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం- ఆయా సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. యూకేకు చెందిన యమ్నా సంస్థ రూ.16 వేల కోట్ల పెట్టుబడితో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వద్ద ఏడాదికి 1 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ ను ఏర్పాటు చేసేందుకు ఎంఓయూ కుదుర్చుకుంది. అలాగే కేఎస్ఎహెచ్ ఇన్ఫ్రా సంస్థ మచిలీపట్నంలో 150 కిలోటన్నుల సామర్థ్యంతో గ్రీన్ హైడ్రోజన్ 600 కిలోటన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీనికోసం రూ.35 వేల కోట్ల రూపాయల్ని పెట్టుబడి పెట్టనుంది. అంతకుముందు, సదస్సులో భాగంగా ఇంధన రంగానికి చెందిన వివిధ సంస్థల సీఈఓలు, ఎండీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి భేటీ అయ్యారు. ఈ సదస్సుకు నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

## 22 ప్రాజెక్టులతో 30,899 ఉద్యోగాలు

మొదటిపేజీ తరువాయి – కేశవ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్ లు హాజరయ్యారు. ఎస్ఐపీబీ సమావేశానికి సీఎస్ కె.విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన, పర్యాటక రంగాలకు సంబంధించిన రూ.39,473 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది. పరిశ్రమలు-వాణిజ్య రంగానికి చెందిన 11 ప్రాజెక్టులు, ఇంధన రంగంలో 7, పర్యాటక రంగంలో 3, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో ఒక్కోటి చొప్పున ప్రాజెక్టులు ఎస్ఐపీబీ ఆమోదం పొందాయి. మొత్తం 22 ప్రాజెక్టుల ద్వారా 30,899 మందికి ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి.

**సమీకృత ప్రణాళికతో పారిశ్రామిక ప్రాజెక్టులు :** పారిశ్రామిక ప్రాజెక్టులకు సమీపంలో రహదారులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు లాంటి మౌలిక సదుపాయాలతో పాటు ఆ ప్రాంతంలో ఎకనామిక్ యాక్టివిటీ పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. భూములు ఇచ్చిన రైతులు, స్థానికులకు ప్రయోజనం కలిగితేనే వారు సంతోషంగా భూములు ఇవ్వగలుగుతారని సీఎం పేర్కొన్నారు. భూములు కేటాయించిన ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా తమ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పర్యాటక ప్రాజెక్టుల విషయంలోనూ సమీకృత ప్రణాళికల్ని అమలు చేయాల్సిందిగా సీఎం ఆదేశాలు జారీ చేశారు. కేవలం నిర్దేశిత ప్రాజెక్టుకు మాత్రమే పరిమితం కాకుండా అనుబంధంగా కార్యకలాపాలు వచ్చేందుకు అవకాశం కల్పించాలని సూచించారు. ప్రత్యేకించి సర్వీసు సెక్టార్ కూడా వచ్చేలా ప్రాజెక్టులను ఇంటిగ్రేట్ చేయాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. పీపీపీ విధానంలో చేపట్టే పర్యాటక ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ భూములను సేకరించి సిద్ధం చేసుకోవాలని అన్నారు. శ్రీశైలంలో దేవాలయంతో పాటు భారీ నీటి ప్రాజెక్టు కూడా ఉందని ఎక్కువ మంది పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఆస్కారం ఉండేలా సమీకృత పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే శ్రీశైలం రహదారి విస్తరణపైనా దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఆతిథ్య రంగంలో కేవలం హెూటల్ గదులకు మాత్రమే పరిమితం కాకుండా అనుబంధ వినోద కార్యకలాపాలు, సేవల రంగానికి సంబంధించిన ప్రాజెక్టులు వచ్చేలా చూడాలన్నారు. మరో వైపు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎంత మందికి ఉద్యోగాలను కల్పించామో వివరాలు తెలిసేలా ఎంప్లాయిమెంట్ పోర్టల్ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకూ జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల్లో 109 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఇందులో పారిశ్రామిక రంగానికి చెందిన 46 ప్రాజెక్టులు, ఇంధన రంగానికి చెందిన 41 ప్రాజెక్టులు, పర్యాటక రంగలో 11, ఐటీ లో 7, ఫుడ్ ప్రాసెసింగ్ 4 పరిశ్రమలకు చెందిన పెట్టుబడులు ఎస్ఐపీబీ ఆమోదం పొందాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా రూ.5,74,238 కోట్ల విలువైన పెట్టుబడులు వచ్చాయి. అలాగే 5,05,968 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి.

## అమరావతి ఓఆర్ఆర్ పనుల్లో వేగం భూసేకరణకు రూ.5,300 కోట్లు!

మొదటిపేజీ తరువాయి –

కేంద్ర ప్రభుత్వం ఓఆర్ఆర్ వెడల్పును 70 మీటర్ల నుంచి 140 మీటర్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో, అందుకు అనుగుణంగా భూసేకరణ, నిధులపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణకే దాదాపు రూ.5,000 కోట్లు, అటవీ భూముల కోసం మరో రూ.300 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాథమికంగా అంచనా వేసింది. మొత్తం 189 కిలోమీటర్ల పొడవున నిర్మించే ఈ ఓఆర్ఆర్.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లాల మీదుగా వెళ్లనుంది. దీనికోసం సుమారు 3,400 హెక్టార్ల ప్రభుత్వ, పట్టా, అసైన్డ్ భూములతో పాటు 250 హెక్టార్ల అటవీ భూములు అవసరమవుతాయని అధికారులు గుర్తించారు. గతంలో 70 మీటర్ల వెడల్పు ప్రతిపాదనతో పోలిస్తే భూమి అవసరాలు, బడ్జెట్ రెట్టింపు కావడం గమనార్హం. ఈ భారీ ప్రాజెక్టును 8 నుంచి 10 ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టాలని భావిస్తున్నారు. సగటున 25 కిలోమీటర్లకు ఒక ప్యాకేజీ చొప్పున పనులు కేటాయించనున్నారు. కృష్ణా నదిపై అమరావతికి సమీపంలో మున్నలూరు-ముత్తాయిపాలెం మధ్య ఒకటి, వల్లూరుపాలెం-వల్లభాపురం మధ్య మరొకటి చొప్పున రెండు భారీ వంతెనలను నిర్మించనున్నారు. ఈ వంతెనలను వేర్వేరు ప్యాకేజీలుగా చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సిద్ధం చేస్తున్న సమగ్ర నివేదికను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు పంపనున్నారు. అక్కడ వివిధ కమిటీల ఆమోదం తర్వాత కేంద్ర మంత్రివర్గం తుది అనుమతి ఇవ్వనుంది. అనంతరం భూసేకరణ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమవుతుంది. ఆరు జాతీయ రహదారులను అనుసంధానించే ఈ ఓఆర్ఆర్‌కు కొత్త జాతీయ రహదారి నంబర్‌ను కేటాయించాలని కూడా కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు.

## భారత నౌకాదళంలో చేరిన డీప్ సీ రెస్క్యూ నౌక 'నిస్తార్'

మొదటిపేజీ తరువాయి –

విశాఖపట్నం నౌకాదళ డాక్‌యార్డ్‌లో దేశంలో తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి నిర్మించిన డైవింగ్ సపోర్ట్ వెసెల్ ఐఎన్ఎస్ నిస్తార్ లాంఛనంగా భారత నౌకాదళంలోకి ప్రవేశించింది. విశాఖలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి హాజరయ్యారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ద్వారా నిర్మితమైన ఈ డీప్ సీ రెస్క్యూ నౌక ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో ఒక మైలురాయిగా నిలిచింది.

**ఐఎన్ఎస్ నిస్తార్ గురించి ముఖ్య వివరాలు**

పరిమాణం మరియు సామర్థ్యం: ఈ నౌక దాదాపు 10,000 టన్నుల బరువు, 118 మీటర్ల పొడవు కలిగి ఉంది. ఇది ఇండియన్ రిజిస్టర్ ఆఫ్ షిప్పింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించబడింది.

సాంకేతికత: ఈ నౌక 300 మీటర్ల లోతు వరకు సాటరేషన్ డైవింగ్, 75 మీటర్ల లోతు వరకు సైడ్ డైవింగ్ స్టేజ్, మరియు 1,000 మీటర్ల లోతు వరకు రిమోట్లీ ఆపరేటెడ్ వెహికల్స్ ద్వారా డైవర్ సహాయం మరియు సాల్వేజ్ పనులు చేయగలదు.

మదర్ షిప్ గా పాత్ర: ఇది డీప్ సబ్‌మెర్జెన్స్ రెస్క్యూ వెహికల్ కు మదర్ షిప్‌గా పనిచేస్తుంది, ఇది అత్యవసర పరిస్థితుల్లో సబ్‌మెరైన్‌లో చిక్కుకున్న సిబ్బందిని రక్షించడానికి ఉపయోగపడుతుంది.

స్వదేశీ భాగాలు: ఈ నౌకలో 75% కంటే ఎక్కువ భాగాలు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయబడ్డాయి, 120కి పైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల సహకారంతో నిర్మితమైంది.

చారిత్రక నేపథ్యం

'నిస్తార్' అనే పేరు సంస్కృతం నుండి వచ్చింది, దీని అర్థం 'విముక్తి' లేదా 'రక్షణ'. 1971లో భారత్-పాకిస్థాన్ యుద్ధంలో పాకిస్థాన్ సబ్‌మెరైన్ ఘాజీని గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన మొదటి నిస్తార్ నౌక యొక్క వారసత్వాన్ని ఈ కొత్త నౌక కొనసాగిస్తుందని నౌకాదళ అధిపతి అడ్మిరల్ త్రిపాఠి తెలిపారు.

ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం

ఈ నౌక నిర్మాణం భారతదేశం యొక్క మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి ఒక స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఇది కేవలం భారత నౌకాదళ సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, గ్లోబల్ సబ్‌మెరైన్ రెస్క్యూ సామర్థ్యం గల కొన్ని దేశాల సమూహంలో భారత్‌ను చేర్చింది.

## హైడ్రో ప్రాజెక్టును సందర్శించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

మొదటిపేజీ తరువాయి – పవర్ హౌస్ లో రాష్ట్రంలోని హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై పై సమీక్ష నిర్వహించారు. ముందుగా అధికారులు అన్ని అధికారులు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆయా పవర్ ప్రాజెక్టుల వారిగా ప్రస్తుత పరిస్థితిని వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి అధికారులకు వివిధ అంశాలపై దిశ నిర్దేశం చేస్తూ... అన్ని హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్ట లలోని అన్ని యూనిట్లు వినియోగంలో తీసుకురావాలన్నారు. నిర్దేశించిన సమయం ప్రకారం వాటిని పూర్తి చేయాలన్నారు. పవర్ ప్రాజెక్టు యూనిట్లు ఆలస్యం కాకుండా చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం ఉండవద్దని, అన్ని ప్రాజెక్టుల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని, ఇందుకొక క్యాలెండర్ ను రూపొందించాలని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో దాని ప్రకారం ప్రతి వారం సమీక్షించాలని, ముందు నుండే సమీక్షలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి సంవత్సరం పవర్ కు డిమాండ్ పెరుగుతున్నదని, సంవత్సర కాలంలోనే 2000 మెగావాట్ల పవర్ డిమాండ్ పెరిగిందని, పెరుగుతున్న పవర్ డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని పవర్ ను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచంలో వస్తున్న నూతన సాంకేతికతపై సిబ్బందికి అప్డేట్ అయ్యే విధంగా శిక్షణ ఇవ్వాలని, దీనిపై అధ్య యనం చేసి పెరుగుతున్న పవర్ డిమాండ్ ను దృష్టిలో ఉంచుకొని అప్డేట్ అయ్యేలా చూడాలన్నారు. ఇందుకు పీరియాడికల్ సమీక్షలు నిర్వహించాలని, రాష్ట్రంలో ఉన్న జెన్కో సిబ్బంది సీఎండి మొదలు కొని కిందిస్థాయి వరకు కొత్త టెక్నాలజీ పై మూడు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో రెన్యూవబుల్ ఎనర్జీ పై దృష్టి సారించాలని, ప్రపంచవ్యాప్తంగా రెన్యువబుల్ ఎనర్జీకి వెళ్తున్న దృష్ట్యా దీనిపై దృష్టి సారించాలన్నారు. గడచిన సంవత్సరం కాలంలో జెన్కో సిబ్బంది ఒక పద్ధతి ప్రకారం పనిచేయడం వల్ల ఎలాంటి బ్రేక్ డౌన్లు, విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ ను అందించగలిగామని, ఇందుకుగాను ఆయన శాఖలోని అధికారులు, సిబ్బందిని అభినందించారు. విద్యుత్ ఉత్పత్తి సరఫరాలో ఎప్పటికప్పుడు



జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిదీ విద్యుత్ పైన ఆధారపడి ఉన్నదని, రాష్ట్ర స్థూల ఉత్పత్తి విద్యుత్ పైన ఆధారపడిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జెన్కో సిఎండి డాక్టర్ హరీష్ ఆయా ప్రాజెక్టులపై వివరాలను తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ శాసనసభ్యులు జైవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అదనపు కలెక్టర్లు జే. శ్రీనివాస్, నారాయణ అమిత్, హైడల్ డైరెక్టర్ పి. బాలరాజు, సి ఇ నారాయణ, ఎస్ ఈ లు వెంకటరమణ , ఓ అండ్ ఎం డి ఎస్ ఈ రఘురాం, సివిల్ ఎస్ ఈ డి .రామకృష్ణారెడ్డి, సి ఈ మంగేష్ కుమార్,ఈ ఉపేందర్ తదితరులు ఈ సమీక్షకు హాజరయ్యారు.

## త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం



ఆ నాటి ప్రధాని పీవీ నరసింహారావు హయాం నుంచి వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక పోరాటాలు జరిగాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తుచేశారు. మీడియాతో మాట్లాడుతూ కోచ్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కాబోతుందని తెలిపారు. రైలు మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్‌కి ప్రధాని మోదీ భూమి పూజ చేశారని.. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ 60 శాతం పనులు పూర్తి అయ్యాయని అన్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనుల పురోగతిని పరిశీలిస్తారని చెప్పారు. రైలు ఇంజన్, కోచ్, వ్యాగన్స్ ఉత్పత్తి అయ్యేలా ప్లాన్ చేస్తున్నామని.. ముందుగా రైలు ఇంజన్ తయారీ చేయాలని నిర్ణయించామని కేంద్రమంత్రి అన్నారు.

**వరంగల్‌లో ఆదునిక కోచ్‌లు..**

రాదు అనుకున్న పరిశ్రమను మోదీ తెలంగాణకు ఇచ్చారని చెప్పుకొచ్చారు. వరంగల్‌కు మెగా టెక్స్ టైల్ పార్క్ తీసుకురావడం జరిగిందన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పాలకులు మాత్రం హైదరాబాద్ చుట్టే ఆలోచన చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. వరంగల్ విమానాశ్రయానికి భూమి సేకరించి ఇవ్వాలని కేసీఆర్‌కు అనేక లేఖలు రాసినట్లు తెలిపారు. కేసీఆర్ రాళ్లు వేయడం, విమర్శించడం తప్ప.. భూమి సేకరించి ఇవ్వలేదని విమర్శించారు. రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వచ్చే ఏడాది ఉత్పత్తి ప్రారంభించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రెండు వందల కోట్లతో ప్రారంభమైందని.. మరో రెండు వందల కోట్ల వరకు బడ్జెట్ పెరిగే అవకాశం ఉందన్నారు. వరంగల్‌లో ఆధునికమైన కోచ్‌లు తయారు చేసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. సుమారు మూడు వేల మందికి ఉపాధి అవకాశం దొరుకుతుందన్నారు. ఇక్కడ నివసించే రాజస్థాన్ ప్రజలు రైలు కావాలని కోరుతున్నారని.. రేపు రాజస్థాన్‌కు ట్రైన్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎంఎంటీఎస్ రెండో పేజ్ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందానికి కట్టుబడి లేదని అన్నారు. యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్‌ను విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ జనవరిలో భక్తులకు అంకితం చేస్తామని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కూడా వచ్చే సంవత్సరం ప్రజలకు అంకితం చేస్తామని ప్రకటించారు. కాచిగూడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. తెలంగాణకు మోదీ ఏమి చేశారన్న వాళ్లు వినాలి.. కళ్ళతో చూడాలన్నారు. ప్రధాని శంకుస్థాపనకు వస్తే రాకుండా ఆ నాటి ముఖ్యమంత్రి ఫాం హౌస్‌లో పడుకున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణలోని అన్ని రైల్వే స్టేషన్లలో ఉచిత వైఫై సదుపాయం కల్పిస్తున్నామన్నారు..

## ఆపరేషన్ సిందూర్ దెబ్బ... రెండు నెలలుగా ఎయిర్‌పోర్టు మూసివేత




విడుదల చేసింది. విమానయాన కార్యకలాపాలు అందుబాటులో ఉండవని పేర్కొంది. అయితే మూసివేతకు గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా మే 10న భారత్ దాడి చేసిన నేపథ్యంలో తొలి నోటమ్ జారీ అయింది. దాంతో పంజాబ్ ప్రావిన్సులో ఉన్న ఈ వ్యూహాత్మక ఎయిర్‌బేస్ ఒక వారం పాటు అందుబాటులో ఉండదని ప్రకటించింది. ఆ తర్వాత గత నెల నాలుగో తేదీన రెండో నోటమ్ జారీ చేసింది. మూసివేతను జులై 4 వరకు పొడిగించింది. తాజాగా ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగించింది.

## బాసర అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు.




**బాసర:జూలై 18:తెలంగాణ సేన న్యూస్. :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శుక్రవారం ఉదయం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి సన్నిధికి వచ్చిన మంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు వేద మంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అర్చకులు మంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అలాగే మహంకాళి, దత్తాత్రేయ స్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం వసతి గృహంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంత్రికి నిర్మల్ పెయింటింగ్స్ చిత్రపటం బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని ఆలయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తోందని, బాసర నూతన ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలుపై ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రితో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకుముందు ఐఐఐటి వసతి గృహంలో మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ పాఠక్, ఈవో సుదర్శన్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చండూరులో ఘనంగా జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**చండూరు, తెలంగాణ సేన:** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు సూర్యాపేట శాసనసభ్యులు శ్రీ గుంతకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదినం సందర్భంగా చండూరు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొని స్థానిక చౌరస్తాలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిత్యం ప్రజల అభివృద్దే ఎజెండాగా ఆరాటపడే ప్రజా నాయకుడు జగదీశ్ రెడ్డి అని అన్నారు. నల్లగొండ జిల్లా అభివృద్ధి ప్రదాత జగదీశ్వర్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ చండూరు మండల, పట్టణ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్నముదిరాజ్, కొత్తపాటి సతీష్, అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, కౌన్సిలర్ కోడి వెంకన్న, యువజన అధ్యక్షులు ఉజ్జిని అనిల్ రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగోని వెంకన్న గౌడ్, జిల్లా నాయకులు ఎత్తపు మధుసూదన్ రావు, తేలు కుంట్ల చంద్రశేఖర్, సంగేపు సువర్ణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ గుండమల్ల శ్రీనివాసులు, తేలుకుంట్ల జానయ్య, మాధగోని వెంకటేశం, కావలి ప్రసాద్, నరేష్, దశరథ, స్వామి, రామన్న, ఇరిగి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి వారదుల జర్నలిస్టులు ం మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ ను శుక్రవారం నాడు తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటున్న జర్నలిస్టుల సేవలు అద్భుతం అని, ప్రజలు సీజనల్ వ్యాధులు దృశ్య అప్రమత్తంగా ఉండాలని, వార్డులలో ఏ సమస్య వచ్చినా నేరుగా ఆఫీసుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, చెత్త సేకరణలో మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరడం జరుగుతుందన్నారు. వార్డులలో ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని దాని వలన దోమలు వృద్ధి చెంది డెంగ్యూ లాంటి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్ చారి, కార్యవర్గ సభ్యులు గుడాల చంద్రశేఖర్ గుప్తా, ఎల్లం రాజు, మహేష్ పాల్గొన్నారు.

## డాక్టర్లు లేని బస్తి దవఖానలు

### పట్టించుకోని ప్రభుత్వం యంత్రాంగం

### పట్టణ సిపిఎం కార్యదర్శి మాయ కృష్ణ



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్ ,జూలై 18.** : బస్తీ దవఖానాల లో డాక్టర్ లను నియమించాలని, సిపిఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలని గత ప్రభుత్వం బస్తీ దవఖానాలు ఏర్పాటు చేసిందని, ఆరు నెలలుగా డాక్టర్ లు లేక ప్రవేటు ఆసుపత్రికి వెళ్లి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. అంతేకాకుండా బస్తీ దవఖానాల లో మందులు సరిగ్గా రావడం లేదు అని , గోలీలు అందుబాటులో లేని కారణంగా సూదులు ఇవ్వడం లేదని అన్నారు. డాక్టర్లు లేని కారణంగా గత ఆరు నెలల నుంచి అవే మందులను వాడిపిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా పి హెచ్ డి ఓ ఇంచార్జ్ డాక్టర్ నీరజ దగ్గరికి వెళ్తే డాక్టర్ల ఇంటర్వ్యూలు అవుతున్నవి త్వరలో వస్తారని చెపుతున్నారు అని ఆరు నెలల నుండి డాక్టర్లు లేక రోగులు అనేక ఇబ్బందులు దృశ్య వెంటనే బస్తీ దావకానాలలో డాక్టర్లు ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ డిమాండ్ చేస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు బర్ల వెంకటేష్, వోల్దాస్ అంజయ్య, అర్బన్ కాలనీ నాయకులు రియాజ్, సుజిత్ ,అరుణ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలు శాంతియుతంగా సుఖ సంతోషాలతో ఉండాలి

### జియాగూడ లోని శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా

### మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్ ,తెలంగాణ సేన న్యూస్ ,జూలై 18. :** రాష్ట్ర ప్రజలు ఆనందంగా, ఆరోగ్యంగా ,శాంతియుతంగా ఉండాలని మైసమ్మ తల్లిని వేడుకున్నట్లు రాష్ట్ర మైన్స్, జియాలజీ శాఖ మంత్రి వెంకటస్వామి తెలిపారు. హైదరాబాద్ జియాగూడ లోని శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయంలో ఘనంగా నిర్వహించిన బోనాల పండుగ కార్యక్రమంలో శుక్రవారం ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మైన్స్ , జియాలజీ శాఖా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు సమర్పించిన , రాష్ట్ర ప్రజలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా, శాంతియుతంగా ఉండాలని మైసమ్మ తల్లిని ప్రార్థించారు. తెలుగు ప్రజల భక్తి, భగవదనిశ్ఠకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ మన సంప్రదాయాలకు, సాంస్కృతిక విలువలకు జీవం పోస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ తో పాటు స్థానిక భక్తులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. భక్తులతో మమేకమైన మంత్రి ఆలయ అభివృద్ధి గురించి అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# నిరంతర ప్రక్రియగా రేషన్ కార్డుల జారీ

### యాదగిరిగుట్టలో ఆహార భద్రత కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**భువనగిరి ప్రతినిధి ,తెలంగాణ సేన న్యూస్, జూలై 18 :** నిరంతర ప్రక్రియగా రేషన్ కార్డుల జారీ చేయనున్నట్లు, ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వెల్లడించారు. శుక్రవారం యాదగిరిగుట్ట ఎస్ ఎల్ ఎన్ ఎస్ ఫంక్షన్ హాలులో కలెక్టర్ హనుమంతరావు అదనపు రెవెన్యూ కలెక్టర్ వీరారెడ్డిల తో కలిసి ఆహార భద్రత ,కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు .సందర్భంగా బీర్ల మాట్లాడుతూ,ప్రజా పాలన లో భాగంగా అర్హులైన లబ్దిదారులకు నియోజకవర్గంలో కొత్తగా 5,600 రేషన్ కార్డులు మంజూరీ చేయడం జరిగిందని,15,632 యూనిట్లు మొత్తం 18,640 మంది సుమారు నియోజకవర్గంలోనే 36 వేల మందికి 6 కిలోల చొప్పున తెల్ల రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యంతో పేద వారు అన్నం తినకుండా బియ్యం దళారులకు అమ్ముకునేవారు అని , సీఎం గొప్ప ఆలోచన తో పేదవారు కడుపునిండా అన్నం తినాలనే సంకల్పనతో రేవంత్ రెడ్డి ఏ బియ్యం తింటున్నారో అదే బియ్యం ప్రతి పేదవారు కడుపునిండా తినాలని గొప్ప కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగింది అన్నారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ఒక పండుగ వాతావరణం లో అమలు జరుగుతున్నాయని అన్నారు. మహిళలకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చి ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రేషన్ కార్డు అనేది ఒక చిరకాల కోరిక అని అన్నారు.రేషన్ కార్డులో కొత్తగా కుటుంబసభ్యుల పేరు నమోదు చేసుకోవాలన్న ప్రక్రియ గతంలో లేదని ఈ ప్రభుత్వం వచ్చాక కొత్త వారిని రేషన్ కార్డులు నమోదు చేయడానికి నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రతి పేద వారు కడుపు నిండా సన్న బియ్యం తిన్నాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గొప్ప కార్యక్రమం చేపట్టిందన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఉద్దేశం అన్నారు. జిల్లాలో 1/4 శాతం ఆలేరు నియోజకవర్గ లబ్ధిదారులకే కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ,ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులలో భాగంగా అర్హులైన ప్రతి వారికి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తదనుగుణంగా ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఇంకా ఎవరైనా కొత్తగా అప్లై చేసుకోవాలన్నా, కొత్తగా పెళ్లి అయిన వారు, నమోదు చేసుకోవాలన్న పిల్లల పేర్లు నమోదు చేసుకోవాలన్నా , ఇంకా ఎవరైనా చేసుకోపోతే ఎప్పుడైనా అప్లై చేసుకోవచ్చని ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు.కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,ఆలేరు ,మోత్కూరు మార్కెట్ కమిటీల చైర్మన్ లు ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి ,విమల వెంకటేష్,ఆర్డీఓ కృష్ణారెడ్డి,ఆలేరు నియోజక వర్గం తహసీల్దార్ లు , ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

## క్రాన్ బెర్రీలను తినడం వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో తెలుసా..? కచ్చితంగా వీటిని రోజూ తినాలి..!

మనకు తినేందుకు అనేక రకాల పండ్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో క్రాన్ బెర్రీలు కూడా ఒకటి. చూసేందుకు ఎరుపు రంగులో ఎంతో ఆకర్షణీయంగా ఈ పండ్లు మనకు దర్శనమిస్తాయి. అయితే మార్కెట్‌లో ఈ పండ్లు మనకు ఏడాది పొడవునా లభించినా చాలా మంది ఈ పండ్లను అంతగా తినరు. ధర ఎక్కువ ఉంటాయన్న కారణం చేత ఈ పండ్లను చాలా మంది తినరు. కానీ క్రాన్‌బెర్రీలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఈ పండ్లను తింటే అనేక పోషకాలను పొందవచ్చు. మనకు కలిగే పలు వ్యాధులను నయం చేయడంలో క్రాన్ బెర్రీలు ఎంతగానో సహాయం చేస్తాయి. ఒక కప్పు క్రాన్ బెర్రీలను తింటే సుమారుగా 46 క్యాలరీల శక్తి లభిస్తుంది. ఈ పండ్లలో 87 శాతం నీరే ఉంటుంది. 12 గ్రాముల పిండి పదార్థాలు, 4 గ్రాముల ఫైబర్, 0.4 గ్రాముల ప్రోటీన్లు, 0.1 గ్రాము కొవ్వు ఉంటాయి. అలాగే విటమిన్లు సి, కె1, ఇ, బి1, బి2, బి3, బి6, మాంగనీస్, కాపర్, పొటాషియం, ఐరన్ తదితర పోషకాలు ఈ పండ్లలో సమృద్ధిగా ఉంటాయి.

**మూత్రాశయ సమస్యలకు..**

మూత్రాశయ సమస్యలు ఉన్నవారికి క్రాన్ బెర్రీలు ఎంతగానో మేలు చేస్తాయి. ఈ పండ్లను తింటే మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. మూత్రం ధారాళంగా వస్తుంది. మూత్రం సాఫీగా జారీ అవుతుంది. క్రాన్ బెర్రీలను తినడం వల్ల నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. క్రాన్ బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా ఆంథో సయనిన్స్, ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని, శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులను తగ్గిస్తాయి.



అలాగే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను సైతం నియంత్రణలో ఉంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే కొలెస్ట్రాల్ కరిగిపోతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు.

**జీర్ణ వ్యవస్థకు..**

క్రాన్ బెర్రీలను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణాశయం, పేగుల క్యాన్సన్ రాకుండా అడ్డుకుంటుంది. జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ సమస్యలు రాకుండా చూస్తుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణాశయంలో ఉండే పురుగులు, ఇతర సూక్ష్మ క్రిములు సైతం నశిస్తాయి. క్రాన్ బెర్రీలలో యాంటీ క్యాన్సర్ గుణాలు ఉంటాయి. ఈ పండ్లలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయి. దీంతో క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. క్రాన్ బెర్రీలను తినడం వల్ల విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభించి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సీజనల్ వ్యాధులైన దగ్గు, జలుబు, జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు.

**నొప్పులు, వాపులకు..**

క్రాన్ బెర్రీలలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి శరీరంలో ఏర్పడే వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ పండ్లను తింటే మెటబాలిక్ ప్రక్రియ మెరుగు పడుతుంది. క్యాలరీలు సరిగ్గా ఖర్చవుతాయి. దీంతో కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. క్రాన్ బెర్రీలను రోజుకు ఒక కప్పు మోతాదులో తినవచ్చు. వీటి జ్యూస్ అయితే రోజుకు 200 ఎంఎల్ మోతాదులో తాగాల్సి ఉంటుంది. మార్కెట్‌లో మనకు క్రాన్ బ్రెర్రీలు డ్రై ఫ్రూట్స్ రూపంలోనూ అందుబాటులో ఉంటున్నాయి. కనుక ఈ పండ్లను అయినా సరే తినవచ్చు. ఇలా క్రాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## పిస్తా పప్పును అసలు రోజుకు ఎంత పరిమాణంలో తినాలి..? దీంతో ఏమేం లాభాలు కలుగుతాయి..?



ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ అన్ని పోషకాలు కలిగిన ఆహారాలను తినాలన్న విషయం అందరికీ తెలిసిందే. పోషకాహారాల విషయానికి వస్తే నట్స్ ఎంతో ప్రాధాన్యతను చోటు చేసుకున్నాయి. చాలా మంది నట్స్‌ను తింటుంటారు. వాటిల్లో పిస్తా కూడా ఒకటి. అయితే వీటిని రోజుకు ఎన్ని తినాలి.. ఎంత పరిమాణంలో వీటిని తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయి.. అన్న వివరాలు చాలా మందికి తెలియవు. పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం పిస్తాపప్పును రోజుకు గుప్పెడు మోతాదులో తినవచ్చు. అంటే సుమారుగా 30 గ్రాములు అన్నమాట. గుప్పెడు పిస్తాపప్పును తింటే సుమారుగా 160 క్యాలరీల శక్తి లభిస్తుంది. ఆరోగ్యకరమైన కొవ్వులు 13 గ్రాములు, ప్రోటీన్లు 6 గ్రాములు, పిండి పదార్థాలు 8 గ్రాములు లభిస్తాయి. ఫైబర్ 3 గ్రాముల వరకు లభిస్తుంది. పిస్తా పప్పులో విటమిన్ బి6, బి1, కె, ఇ అధికంగా ఉంటాయి. మాంగనీస్, కాపర్, ఫాస్ఫరస్, పొటాషియం, మెగ్నిషియం, ఐరన్, జింక్, సెలీనియం అధికంగా ఉంటాయి.

**గుండె ఆరోగ్యానికి..**

పిస్తా పప్పులో మోనో అన్‌శాచురేటెడ్, పాలి అన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఈ పప్పులో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. ఈ పప్పులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంతోపాటు రక్త నాళాల్లో ఏర్పడే వాపులను తగ్గిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. పిస్తా పప్పు గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ పప్పును తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. పైగా ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక ఈ పప్పును తింటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి పిస్తా పప్పు ఎంతగానో మేలు చేస్తుంది. దీంతో షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు.

**బరువు తగ్గేందుకు..**

పిస్తా పప్పులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. ఫైబర్ కారణంగా మలబద్దకం తగ్గుతుంది. పిస్తా పప్పు ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తుంది. ఈ పప్పును తింటే జీర్ణవ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ సమస్యలను తగ్గించుకోవచ్చు. పిస్తాపప్పులో క్యాలరీలు అధికంగా ఉంటాయి. అయినప్పటికీ ఈ పప్పును తింటే బరువు పెరగరు. పైగా ఇందులో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ బరువును తగ్గిస్తాయి. పిస్తా పప్పును తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావనతో ఉంటారు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలనే ప్రణాళికలో ఉన్నవారు పిస్తాపప్పును రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది.

**కంటి ఆరోగ్యానికి..**

పిస్తాపప్పు కంటి ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. దీన్ని తింటే అనేక యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. ఈ పప్పులో లుటీన్, జియాజాంతిన్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. రెటీనాను సంరక్షిస్తాయి. దీంతో వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే కంటి చూపు సైతం మెరుగు పడుతుంది. ఈ పప్పులో అధికంగా ఉండే విటమిన్ బి6, జింక్, కాపర్ శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి సమస్యలు త్వరగా తగ్గుతాయి. పిస్తా పప్పును తింటే శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులు తగ్గిపోతాయి. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలించవచ్చు. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి యవ్వనంగా కనిపిస్తుంది. ఇలా పిస్తా పప్పును ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.



## కలబందను ఇలా ఉపయోగిస్తే చాలు..

# మీ అందం మరింత రెట్టింపు అవుతుంది..!



చాలా మంది ఇళ్లలో కలబందను పెంచుకుంటారు. ఆయుర్వేద ప్రకారం కలబంద ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంటుంది. దీన్ని పలు ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు. అలాగే సౌందర్య సాధన ఉత్పత్తుల్లోనూ కలబందను వాడుతారు. కలబందలో ఎన్నో పోషకాలు ఉంటాయి. దీన్ని ఉపయోగించి చర్మ సౌందర్యాన్ని మెరుగు పరుచుకోవచ్చు. ఇది చర్మ కణాలను అభివృద్ధి చేస్తుంది. ఉన్న కణాలకు మరమ్మత్తులు చేస్తుంది. గాయాలు, పుండ్లను మానేలా చేయడంలో ఎంతగానో సహాయం చేస్తుంది. కలబందలో సహజసిద్ధమైన మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. కనుక చర్మానికి ఇది ఎంతో మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు ఎ, సి, ఇ, బి12 ఉంటాయి. అనేక మినరల్స్, అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా కలబందలో అధికంగా ఉంటాయి. ఇవన్నీ చర్మాన్ని సంరక్షించి ఆరోగ్యంగా ఉంచుతాయి.

**నేరుగా రాయవచ్చు..**

కలబంద గుజ్జులో సహజసిద్ధమైన హైడ్రేటింగ్ గుణాలు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి చర్మానికి చల్లదనాన్ని ఇస్తాయి. అందువల్ల అన్ని రకాల చర్మాలకు కలబంద ఎంతగానో పనిచేస్తుంది. ముఖ్యంగా సున్నితమైన లేదా ఇర్రిటేషన్ ఉన్న, ఎండ వల్ల కందిపోయిన చర్మాన్ని తిరిగి పూర్వ రూపం వచ్చేలా చేస్తుంది. కొద్దిగా కలబంద గుజ్జును ఆకుల్లోంచి సేకరించాలి. దీన్ని మీ ముఖంపై నేరుగా అప్లై చేయాలి. మెడపై కూడా రాయాలి. 15 నుంచి 20 నిమిషాలు వేచి ఉండాలి. లేదా రాత్రి పూట రాసి ఉదయం కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. మెడపై ఉండే నల్లదనం తగ్గుతుంది.

**నిమ్మరసంతో వాడితే..**

కలబందలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు, నీరు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి చల్లదనాన్ని ఇస్తాయి. అందువల్ల ఎండ కారణంగా కందిపోయిన చర్మానికి హాయి లభిస్తుంది. చర్మం త్వరగా మరమ్మత్తులకు గురవుతుంది. దీంతో ఎరుపుదనం తగ్గిపోతుంది. ఎండ వల్ల కందిపోయిన చర్మంపై నేరుగా కలబంద గుజ్జును రాయాలి. కాసేపు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజులో 2 నుంచి 3 సార్లు చేస్తుంటే చర్మం తిరిగి పూర్వ రూపాన్ని పొందుతుంది. మొటిమలను తగ్గించడంలోనూ కలబంద బాగానే పనిచేస్తుంది. ఇందుకు గాను 1 టేబుల్ స్పూన్ కలబంద రసంలో 2 నుంచి 3 చుక్కల నిమ్మరసం కలిపి ఈ మిశ్రమాన్ని మొటిమలు లేదా మచ్చలపై రాయాలి. 15 నుంచి 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే మొటిమలు తగ్గిపోయి ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది.

**యవ్వనంగా కనిపించాలంటే..**

కలబందను వాడడం వల్ల చర్మం తన సహజసిద్ధమైన సాగే గుణాన్ని అలాగే ఉండేలా చేస్తుంది. దీంతో యవ్వనంగా కనిపిస్తారు. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. కలబంద గుజ్జులో కొన్ని చుక్కల విటమిన్ ఇ ఆయిల్‌ను కలిపి ముఖానికి మాస్క్ లా వేస్తుండాలి. దీంతో యవ్వనంగా కనిపిస్తారు. ముఖం కాంతివంతంగా మారుతుంది. కలబందను ఉపయోగించి ఫేస్ మాస్క్‌ను కూడా తయారు చేయవచ్చు. ఇందుకు గాను 1 టేబుల్ స్పూన్ కలబంద గుజ్జులో కొద్దిగా పసుపు వేసి కలపాలి. ఇందులోనే 1 టేబుల్ స్పూన్ పెరుగు లేదా పాలు కలిపి ఫేస్ ప్యాక్ తయారు చేయాలి. దీన్ని ముఖానికి రాసి 10 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఈ ప్యాక్ వల్ల ముఖంపై ఉండే మృత కణాలు పోతాయి. ముఖానికి సహజసిద్ధమైన నిగారింపు వస్తుంది. ఇలా కలబందను ఉపయోగించి అందాన్ని మరింత మెరుగు పరుచుకోవచ్చు.

## అరటి కాడలను తినడం వల్ల ఇన్ని లాభాలు ఉన్నాయా..? తెలిస్తే వెంటనే తింటారు..!

అరటి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. అరటి పండ్లను తినడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. అనారోగ్యం బారిన పడిన వారు శక్తి కోసం అరటి పండ్లను తింటుంటారు. అయితే కేవలం అరటి పండ్లు మాత్రమే కాదు, అరటి కాడలు కూడా మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి. అరటి కాడలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. 100 గ్రాముల అరటి కాడలను తింటే సుమారుగా 16 క్యాలరీల మేర శక్తి లభిస్తుంది. కొవ్వులు, కొలెస్ట్రాల్, సోడియం అసలే ఉండవు. పిండి పదార్థాలు చాలా తక్కువగా కేవలం 2 గ్రాములు మాత్రమే ఉంటాయి. అరటి కాడల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. విటమిన్లు బి6, సి, బి3లతోపాటు పొటాషియం, క్యాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, మాంగనీస్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. అందువల్ల అరటి కాడలను కూడా రోజూ తినాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.



**జీర్ణ సమస్యలకు..**

అరటి కాడలను తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. అరటి కాడలు ప్రీబయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. పొట్టలో ఏర్పడిన అసౌకర్యం తగ్గుతుంది. అరటి కాడలను తింటే అజీర్తి, అసిడిటీ, గుండెల్లో మంట వంటి జీర్ణ సమస్యలు తగ్గుతాయి. పైల్స్ ఉన్నవారికి ఈ కాడలు ఎంతగానో మేలు చేస్తాయి. జీర్ణాశయంలో ఏర్పడే అల్సర్లను సైతం తగ్గిస్తాయి. అరటి కాడల్లో క్యాలరీలు చాలా స్వల్పంగా ఉంటాయి. కొవ్వు అసలే ఉండదు. పైగా ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక ఈ కాడలను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది.

**కిడ్నీ స్టోన్లు ఉంటే..**

అరటి కాడ సహజసిద్ధమైన డై యురెటిక్‌గా పనిచేస్తుంది. ఇది మూత్రం ధారాళంగా వచ్చేలా చేస్తుంది. దీంతో మూత్రం ద్వారా వ్యర్థాలు, టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. శరీరంలో అదనంగా ఉండే ద్రవాలు బయటకు విసర్జించబడతాయి. దీంతో కిడ్నీలపై పడే భారం తగ్గుతుంది. అరటి కాడల్లో అధికంగా ఉండే పొటాషియం కిడ్నీల్లో స్టోన్స్ ఏర్పడకుండా చూస్తుంది. కిడ్నీ స్టోన్లు లేదా మూత్రాశయ ఇన్ఫెక్షన్లు ఉన్నవారు, మూత్రంలో మంట వస్తున్నవారు అరటి కాడలను తింటుంటే చక్కని ఫలితం ఉంటుంది. అరటి కాడల్లో అధికంగా ఉండే ఫైబర్ వల్ల ఆహారం నెమ్మదిగా జీర్ణం అవుతుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. దీని వల్ల షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారికి అరటి కాడలు ఎంతగానో మేలు చేస్తాయి. వీటిని తింటే షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..**

అరటి కాడల్లో అధికంగా ఉండే పొటాషియం శరీరంలో సోడియం స్థాయిలను మెరుగ్గా నిర్వహిస్తుంది. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు అరటి కాడలను తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. మన శరీరంలో ఉన్న కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించేందుకు కూడా అరటి కాడలు పనిచేస్తాయి. వీటిని తింటుంటే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీని వల్ల హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఇలా అరటి కాడలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## మార్కెట్ ఈ కాయలు ఎక్కడ కనిపించినా సరే..

# విడిచిపెట్టకుండా తెచ్చుకుని తినండి.. ఎందుకంటే..?



మార్కెట్‌లో మీరు అనేక రకాల కూరగాయలను చూస్తుంటారు. వాటిల్లో చౌ చౌ కూడా ఒకటి. వీటినే కయోట్ స్క్వాష్ అని కూడా పిలుస్తారు. తెలుగులో సీమ వంకాయలని అంటారు. ఇవి చూసేందుకు ఒక రకమైన జామకాయలను పోలి ఉంటాయి. అయితే ఇది కూరగాయ రకానికి చెందినది. దీన్ని కూరగా చేసుకుని తింటారు. ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. ఈ క్రమంలోనే సీమ వంకాయలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. 1 కప్పు ఉడకబెట్టిన సీమ వంకాయలను తింటే సుమారుగా 39 క్యాలరీల శక్తి లభిస్తుంది. పిండి పదార్థాలు 9 గ్రాములు, ప్రోటీన్లు 2 గ్రాములు, కొవ్వు 0.5 గ్రాములు, ఫైబర్ 4 గ్రాములు లభిస్తాయి. అలాగే వీటిలో విటమిన్లు బి9, సి, కె, బి6, మాంగనీస్, కాపర్, జింక్, పొటాషియం, మెగ్నిషియం, ఐరన్, ఫాస్ఫరస్, క్యాల్షియం కూడా ఉంటాయి. ఇవి మనకు పోషణను అందిస్తాయి.

**గుండె ఆరోగ్యానికి..**

సీమ వంకాయలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక యాంటీ ఆక్సిడెంట్లను పొందవచ్చు. ముఖ్యంగా విటమిన్ సి లభిస్తుంది. ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు కూడా వీటిల్లో ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీంతో రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

**డయాబెటిస్ ఉంటే..**

సీమ వంకాయల్లో పిండి పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. పైగా ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. ఇది షుగర్ ఉన్నవారికి ఎంతగానో మేలు చేసే విషయం. వీటిని తినడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. సాధారణ జీర్ణ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు.

**బరువు తగ్గేందుకు..**

సీమ వంకాయల్లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. పైగా ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధికంగా బరువు ఉన్నవారు సీమ వంకాయలను తరచూ తింటుంటే బరువును తగ్గించుకోవచ్చు. వీటిని తింటే గర్భిణీలకు సైతం ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ కాయల్లో ఫోలేట్ అధికంగా ఉంటుంది. ఇది గర్భంలో ఉన్న శిశువు ఎదుగుదలకు సహాయ పడుతుంది. కనుక గర్భిణీలు వీటిని తరచూ తినాలి. ఈ కాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు చాలా శక్తివంతంగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి. క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఇలా సీమ వంకాయలను ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## ఎక్కువ మంది ఎడమ చేతికే వాచ్ ని ఎందుకు ధరిస్తారో తెలుసా..!



ప్రజలు తమ చేతి మణికట్టుకి వాచ్ ని ధరిస్తారు. ప్రతి ఒక్కరూ సర్వసాధారణంగా చేతికి వాచ్ ని ధరిస్తారు. ఇలా చేయడం అందం కోసం మాత్రమే కాదు.. ఫ్యాషన్ గా కనిపించడానికి కూడా.. అయితే ఎక్కువ మంది తమ ఎడమ చేతికి మాత్రమే వాచ్ ని ధరిస్తారు. ఎవరో కానీ కుడి చేతికి వాచ్ ని ధరించర. ఎప్పుడైనా ఎక్కువ మంది ఎడమ చేతికి వాచ్ ని ఎందుకు ధరిస్తారు? కుడి చేతికి ఎందుకు ధరించరు అని మీరు ఎప్పుడైనా ఆలోచించారా? ఈ రోజు దీని గురించి ఆసక్తికరమైన సమాచారాన్ని తెలుసుకుందాం.. సమయం చాలా విలువైనది .. గడిచిపోయిన కాలం జీవితంలో ఎన్నటికీ తిరిగి రాదు. అందుకనే ఏపని మొదలు పెట్టినా.. తగిన సమయంలో పూర్తి చేయాలనీ.. అలా సమయం ఆదా చేసుకోవాలని.. భావిస్తారు. అందుకు సమయం తెలుసుకోవడానికి ప్రజలు తరచుగా గోడ గడియారం, వాచ్ వంటి వాటిని ఆశ్రయిస్తారు. తద్వారా కాలాన్ని చూస్తారు. సాధారణంగా సమయం తెలుసుకునేందుకు చేతికి గడియారం ధరిస్తారు. అయితే ఇప్పుడు వాచ్ సమయాన్ని తెలుసుకునేందుకు మాత్రమే కాదు.. ఫ్యాషన్‌లో ఒక భాగంగా భావించి ధరిస్తారు. అయితే ఎవరు ఎలా అంటే అవసరం కోసం అయినా, ఫ్యాషన్ కోసం మైనా వాచ్ ని ధరిస్తున్నా దానిని ఎడమ చేతికే ధరిస్తారు. అయితే ఇలా వాచ్ ని ఎడమ చేతికి మాత్రమే ఎందుకు ధరిస్తారో మీకు తెలుసా? దీని వెనుక ఉన్న కారణాన్ని తెలుసుకోండి. ఎడమ చేతికి వాచ్ పెట్టుకోవడానికి గల కారణం తెలుసా? కొంతమంది అంటే చాలా తక్కువ మంది తమ కుడి చేతికి వాచ్ ని ధరిస్తారు. అయితే ఎక్కువ మంది తమ ఎడమ చేతికి గడియారాలు ధరిస్తారు. దీని వెనుక ఒక ఆసక్తికరమైన కారణం ఉంది. అంటే ప్రజలు ఎక్కువగా తమ కుడి చేతిని పని కోసం ఉపయోగిస్తారు. దీంతో కుడి చేయి ఎక్కువగా బిజీగా ఉంటుంది. కనుక ఎడమ చేతిలో వాచ్ ని ధరించడం వల్ల మీ దినచర్యకు అంతరాయం కలగదు. అంతే కాదు. ఇలా చేయడం వలన వాచ్ సురక్షితంగా ఉంటుంది. అంతేకాదు రాయడం, టైప్ చేయడం వంటి రకరకాల పనులు చేయడానికి మీ కుడి చేతిని ఉపయోగించినప్పుడు.. ఎడమ చేతికి వాచ్ ధరించడం వల్ల సమయం చెప్పడం సులభం అవుతుంది. మరో శాస్త్రీయ కారణం ఏమిటంటే గోడపై వేలాడుతున్న గడియారంలోని 12 సంఖ్య పైకి ఉంటుంది. అదేవిధంగా ఎవరైనా ఎడమ చేతిలో గడియారాన్ని ధరిస్తే, 12 సంఖ్య పైకి ఉంటుంది. అయితే కుడి చేతికి వాచ్ ని ధరిస్తే, వాచ్ లో ఉండే సంఖ్యల క్రమం తారుమారు అవుతుంది. అప్పుడు వాచ్ లో సమయాన్ని చూసేందుకు ఇబ్బంది పడతారు.

## ఏడు రోజులు క్వారంటైన్..




వ్యోమగాములు భూమికి చేరిన తర్వాత ఏడు రోజులపాటూ క్వారంటైన్‌కు తరలించనున్నట్లు ఇస్రో ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. జీరో గ్రావిటీలో గడిపి వచ్చిన వ్యోమగాముల శరీరాలు భూ వాతావరణానికి అలవాటు పడేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇస్రోకు చెందిన ఫ్లైట్ సర్జన్లు వారం రోజుల పాటూ వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారని వెల్లడించింది.

**శుభాన్షు రికార్డు..**

యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మిషన్‌లో భాగంగా శుభాన్షు శుక్లాతోపాటు నలుగురు వ్యోమగాములు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారత వ్యోమగామిగా శుభాన్షు శుక్లా రికార్డు క్రియేట్ చేశారు. 1984లో సోవియట్ యూనియన్‌కు చెందిన ఇంటర్‌కాస్మోస్ మిషన్ కింద సూయజ్ టీ-11 వ్యోమనౌకలో భారత వ్యోమగామి రాకేశ్‌శర్మ తొలిసారిగా అంతరిక్షంలోకి వెళ్లి ఎనిమిది రోజులపాటు ఉండి తిరిగి వచ్చారు. తాజా ప్రయోగంతో 41 ఏండ్ల తర్వాత రోదసిలోకి వెళ్లి వస్తున్న రెండో భారతీయుడిగా శుభాన్షు రికార్డు సృష్టించారు. ఐఎస్ఎస్‌లోకి వెళ్తున్న తొలి భారతీయుడు కూడా ఇతనే. తిరుగు ప్రయాణం నేపథ్యంలో ఆదివారం అంతరిక్ష కేంద్రంలో ఫేర్‌వెల్ సెర్మనీ జరిపారు.

## వ్యాక్స్ వద్దు..



ఇప్పుడు చాలామంది ముఖంపై అవాంఛిత రోమాలతో బాధపడుతున్నారు. హార్మోన్లలో లోపాలు, ఇతర ఆరోగ్య కారణాలతో.. ఈ సమస్యబారిన పడుతున్నారు. వీటిని తొలగించుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది 'వ్యాక్స్' చేయించుకుంటున్నారు. అయితే.. వ్యాక్సింగ్ అనేది అన్నివేళలా మంచిదికాదని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. చర్మ తత్వాన్ని బట్టి వ్యాక్సింగ్‌ను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం అనేక సౌందర్య ఉత్పత్తుల సంస్థలు 'వ్యాక్స్ స్ట్రిప్స్'ను అందిస్తున్నాయి. అయితే, ఇవి సున్నితమైన చర్మం ఉన్నవారిలో తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయట. వ్యాక్సింగ్ వల్ల చర్మంపై దద్దుర్లు రావడం, ఎర్రగా మారడం, ముడతలు పడటంతోపాటు చర్మం మరింత సున్నితంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు ముఖమంతా కందిపోవడం, ర్యాషెస్ వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. కాబట్టి బయట దొరికే ఫేషియల్ వ్యాక్స్, ఇంట్లో తయారుచేసుకున్న ప్యాక్స్ వేసుకునే ముందు.. చర్మ తత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. దేన్నయినా ముఖంపై అప్లయి చేసుకునే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మేలని సలహా ఇస్తున్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్..! 34% పెరగనున్న జీతాలు..?



ప్రభుత్వ ఉద్యోగులకుకేంద్రం గుడ్‌న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. గుడ్‌న్యూస్ చెప్పబోతున్నట్లు తెలిసింది. 8వ వేతన సంఘం ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. దీంతో వేతన సంఘం అమలు కోసం చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ 8వ వేతన సంఘం ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లను గణనీయంగా పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయనున్నట్లు తెలిసింది.ఏకంగా 30 నుంచి 34 శాతం వరకూ పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసే అవకాశం ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. ఇది జనవరి 2026 లేదా 2027లో అమల్లోకి వచ్చే అవకాశం ఉందని బ్రోకరేజ్ సంస్థలు అంచనా వేస్తున్నాయి. 8వ వేతన సంఘం సిఫార్సుల వల్ల దాదాపు 44 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై దాదాపు రూ.1.8 లక్షల కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉంది.ప్రతి పదేళ్లకు ఒక వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తూంటారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల వేతన నిర్మాణాలను ఈ కమిషన్ సమీక్షించి సవరిస్తుంటుంది. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం జనవరి 2016లో అమలులోకి తీసుకువచ్చిన 7వ వేతన సంఘం సిఫార్సులు ఈ ఏడాది డిసెంబర్ 31తో ముగియనున్నాయి. జనవరి 2016 డిసెంబర్ 2025 మధ్య ఏడో వేతన సంఘం 14 శాతం జీతాల పెంపును అమలు చేసిన విషయం తెలిసిందే

# పన్నులు పిండేస్తున్నారు.. గత 11 ఏండ్లలో 274 శాతం పెరుగుదల

కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు పన్నులతో ప్రజల్ని పీల్చిపిప్పి చేస్తున్నది. 11 ఏండ్ల క్రితం గద్దెనెక్కిన ఈ ప్రభుత్వ పెద్దలు.. పన్ను పోటును మరింత పదునెక్కించారు మరి.

**దేశంలో ఏటా ప్రత్యక్ష పన్ను వసూళ్లు పైపైకి..**

వార్షిక వసూళ్లు రూ.7 లక్షల కోట్ల నుంచి 27 లక్షల కోట్ల వరకు ఎగిసిన వైనం

కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు పన్నులతో ప్రజల్ని పీల్చిపిప్పి చేస్తున్నది. 11 ఏండ్ల క్రితం గద్దెనెక్కిన ఈ ప్రభుత్వ పెద్దలు.. పన్ను పోటును మరింత పదునెక్కించారు మరి. ఈ దశాబ్దానికిపైగా కాలంలో దేశంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏకంగా 274 శాతం పెరిగిపోయాయంటే పన్నుల భారం ఏ స్థాయిలో ఎక్కువైందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని గత యూపీఏ సర్కారు హయాంలో చివరి ఆర్థిక సంవత్సరమైన 2013-14లో రూ.7.22 లక్షల కోట్లుగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లుంటే.. గత ఆర్థిక సంవత్సరం (2024-25) రూ.27.03 లక్షల కోట్లుగా ఉన్నాయి.

**కొత్త పన్ను విధానంతో..**

కొత్త ఆదాయ పన్ను విధానంతో పన్ను మినహాయింపులు, కోతలకు తావు లేకుండా చేశారని కేంద్ర ప్రభుత్వంపై పలువురు ఆర్థిక నిపుణులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాత పన్ను విధానంలో సేవింగ్స్‌కు, పెట్టుబడులకు ప్రాధాన్యత ఉండేదని, దీంతో దేశం పొదుపు దిశగా నిర్మాణాత్మకంగా అడుగులేసిందని పేర్కొంటున్నారు. అయితే ప్రతీ బడ్జెట్‌లో పాత పన్ను విధానానికి స్వస్తి పలికేలా.. కొత్త పన్ను విధానంలోనే మార్పులు చేస్తున్నారని, ఇది సరికాదన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు. ఖజానాను నింపుకోవడానికి ప్రజలపై పన్నుల భారాన్ని మోపడం తగదని చెప్తున్నారు. నిజానికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు కూడా ఏటేటా పెరుగుతూపోతున్న సంగతి విదితమే. దీంతో అటు ప్రత్యక్ష, ఇటు పరోక్ష పన్నుల్ని ప్రజానీకం నుంచి సర్కారు పిండుకుంటున్నట్టవుతున్నది.

**రిఫండ్స్ విషయానికొస్తే..**

ఈ 11 ఏండ్లలో రిఫండ్స్ కూడా 474 శాతం పెరిగినట్టు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు చెప్తున్నది. 2013-14లో రూ.83,008 కోట్లుగా ఉన్న రిఫండ్స్.. 2024-25లో రూ.4,76,743 కోట్లుగా ఉన్నట్టు తేలింది. 2014 నుంచి ఇప్పటిదాకా చూసినైట్టెతే ఐటీ రిటర్న్ దాఖలుచేసేవారు 133 శాతం పెరిగారు. 2024-25లో 8.89 కోట్లకుపైగా ట్యాక్స్‌పేయర్స్ ఆదాయ పన్ను (ఐటీ) రిటర్నులను




దాఖలు చేశారు. 2013-14లో 3.8 కోట్లుగానే ఉన్నారు. కాగా, గత 2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి జూలై 10 వరకు రిఫండ్స్ అనంతరం నికర ప్రత్యక్ష పన్నుల ఆదాయం రూ.73,893 కోట్లుగా ఉన్నది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి జూలై 10దాకా రూ.1.02 లక్షల కోట్లుగా నమోదైంది. ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఈసారి రూ.6.65 లక్షల కోట్లుగా, పోయినసారి రూ.6.44 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఏడాది క్రిందటితో పోల్చితే 3.17 శాతం పెరిగాయి

# క్రెడిట్‌కార్డులు తెగ వాడేస్తున్నారు..!




తక్కువ వేతనాలు కారణమట..! దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ప్రథమార్ధంలో దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు 15శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెప్పాయి. ఇ-కామర్స్, ఫుడ్ డెలివరీతో పాటు ఇతర అవసరాల కోసం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగినట్లు భావిస్తున్నారు. దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ప్రథమార్ధంలో దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు 15శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెప్పాయి. ఇ-కామర్స్, ఫుడ్ డెలివరీతో పాటు ఇతర అవసరాల కోసం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగినట్లు భావిస్తున్నారు. బ్యాంకులు సైతం ఈఎంఐ ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్ల పేరుతో ఆఫర్లు సైతం ఇస్తున్నాయి. తాజాగా ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి.తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు క్రెడిట్‌కార్డులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లు పేర్కొంది. థింక్ 360 ఏఐ అధ్యయనం ప్రకారం.. నెలకు రూ.50వేల కంటే తక్కువ జీతం ఉన్న వారిలో 93శాతం మంది క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లు చెప్పింది. అదే సమయంలో స్వయం ఉపాధి పొందుతున్న 85శాతం మంది సైతం క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. ఇప్పుడు పే తర్వాత (బీఎన్‌పీఎల్) సేవలను 18శాతం స్వయం ఉపాధి, వేతన జీవులు 15శాతం మంది ఉపయోగిస్తున్నట్లు డేటా పేర్కొంది.ఈ అధ్యయనం రూ.20వేల మంది ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులపై నిర్వహించింది. ఈ సందర్భంగా థింక్ 360 ఏఐ ఫౌండర్, సీఈవో అమిత్ దాస్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారతదేశ క్రెడెట్ ల్యాండ్ స్కేప్‌లో క్రెడిట్‌కార్డులు, బీఎన్‌పీఎల్ ఇప్పుడు వేతన జీవులతో పాటు ఉపాధి పొందుతున్న వారికి ప్రతీ ఒక్కరికీ అవసరంగా మారాయన్నారు. పెరుగుతున్న ఫిన్ టెక్ కంపెనీలు డిజిటల్ లోన్ రెవల్యూషన్‌ను తీసుకువచ్చాయన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీలు రూ.92వేల కోట్లకుపైగా వ్యక్తిగత రుణాలు ఇచ్చాయి. ఇది మొత్తం రుణాల సంఖ్యలో 76శాతం ఉన్నట్లుగా సూచిస్తుందని పేర్కొన్నారు.

# భారత్‌లో టెస్లా ' మోడల్ కార్ల అమ్మకాలు..

రూ.59.89 లక్షల నుంచి ప్రారంభం ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో తొలి షోరూంను ప్రారంభించిన విషయం తెలిసిందే.ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ )కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం (టెస్లా భారత్‌లో తొలి షోరూంను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున ఉన్న బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లోని మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంఛ్ చేసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది.భారత్‌లో (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా



నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది.ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది

# రేపటి నుంచి మారనున్న రైల్వే తత్కాల్ టికెట్ రూల్స్..!

ఇక ఆధార్ ఓటీపీ తప్పనిసరి..! భారతీయ రైల్వే ఇటీవల తత్కాల్ టికెట్ బుకింగ్ రూల్స్‌ను మార్చిన విషయం తెలిసిందే. రేపటి నుంచి అనగా జులై 15 నుంచి టికెట్ బుకింగ్స్ రూల్స్‌లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఐఆర్‌సీటీ వెబ్‌సైట్, యాప్‌లో తత్కాల్ టికెట్లను బుక్ చేసుకునే సమయంలో ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి కానున్నదిభారతీయ రైల్వే ఇటీవల తత్కాల్ టికెట్ బుకింగ్ రూల్స్‌ను మార్చిన విషయం తెలిసిందే. రేపటి నుంచి అనగా జులై 15 నుంచి టికెట్ బుకింగ్స్ రూల్స్‌లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఐఆర్‌సీటీ వెబ్‌సైట్, యాప్‌లో తత్కాల్ టికెట్లను బుక్ చేసుకునే సమయంలో ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి కానున్నది. అంటే తత్కాల్ టికెట్లు బుక్ చేసుకునే సమయంలో ఆధార్ ఓటీపీని నమోదు చేయాల్సి రానున్నది. రైల్వేశాఖ టికెట్ బుకింగ్‌లో పారదర్శకతను తీసుకువచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నది. తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలో జరిగే మోసాలను ఆపేందుకు రైల్వేశాఖ కొత్త రూల్‌ని ప్రవేశపెట్టింది. ఎందుకంటే తత్కాల్ టికెట్ ప్రక్రియ ప్రారంభమైన వెంటనే.. దాదాపు అన్ని టికెట్ల నిమిషాల్లోనే బుక్ అవుతుంటాయి.కొందరు దళారులు, ఏజెంట్లు టికెట్లన్నింటిని సాఫ్ట్‌వేర్, తప్పుడు మార్గాల్లో బుక్ చేస్తుండడంతో మిగతా ప్రయాణికులు టికెట్లు దొరక్క ఇబ్బందులుపడుతున్నారు. దాంతో ప్రయాణికులు మాత్రమే టికెట్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. కొంత వరకు మోసాలకు అడ్డుకట్ట వేసినట్లవుతుందని రైల్వేశాఖ భావిస్తున్నారు. ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకునేవారు ప్రయాణానికి ఒక ముందు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఏసీ క్లాస్ తత్కాల్ బుకింగ్ సమయం ఉదయం 10 గంటలు కాగా.. నాన్ ఏసీ ప్రయాణానికి 11 గంటలు. కొత్త నిబంధనల ప్రకారం ఏజెంట్లు ఏసీ-నాన్ ఏసీ టికెట్లను తత్కాల్ టికెట్ బుకింగ్ మొదలైన అరగంట




తర్వాత మాత్రమే బుక్ చేసేందుకు అవకాశం ఉంటుంది. అంటే ఏజెంట్లు ఇకపై ఏసీ టికెట్లను 10.30 గంటలకు, నాన్ ఏసీ టికెట్లు 11.30 గంటలకు బుకింగ్స్ ఓపెన్ అవుతాయి. అదే సమయంలో ప్రయాణికులు రైల్వే స్టేషన్ కౌంటర్‌లో నుంచి తత్కాల్ టికెట్లు బుక్ చేరసుకున్నా జులై 15 నుంచి ఆధార్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది.కౌంటర్‌లోనూ ఆధార్ ధ్రువీకరణ జరుగుతుంది. ఈ సమయంలో ప్రయాణికుడి మొబైల్ నంబర్‌ను ఆధార్‌తో లింక్ చేయాలి. తద్వారా ఓటీపీ వస్తుంది. మీరు వేరొకరికి టికెట్ బుక్ చేయాలనుకుంటే.. ఆ ప్రయాణికుడి ఆధార్ నంబర్‌తో పాటు ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుంది. ఎవరికైనా ఆధార్ కార్డ్ ఉండి, టికెట్ బుకింగ్ సమయంలో ఓటీపీ రాకపోతే.. ఆ నంబర్ ఆధార్‌తో లింక్ చేయకపోతే ఐఆర్‌సీటీసీ హెల్ప్‌లైన్ (139)కి కాల్ చేయవచ్చని రైల్వేశాఖ పేర్కొంటున్నది. దాంతో పాటు ఆధార్ నమోదుకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆధార్ హెల్ప్‌లైన్ (1947)ని సంప్రదించవచ్చని పేర్కొంది. ప్రయాణీకుడికి ఆధార్ కార్డు లేకపోతే, తత్కాల్ టికెట్ బుక్ చేసుకోవడం కష్టంగా మారనున్నది. ఎందుకంటే ఆధార్ లేకుండా టికెట్ బుక్ చేసుకోవడానికి మరో మార్గం ఏంటో మాత్రం రైల్వే వెల్లడించలేదు

# బాలెనో, ఎర్టిగా వాహనాలు ప్రియం




మారుతి సుజుకీ..ఎర్టిగా, బాలెనో వాహన ధరలను 1.4 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ రెండు మాడళ్లలో భద్రత ప్రమాణాలను మెరుగుపర్చడంలో భాగంగా ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను నెలకొల్పింది. మారుతి సుజుకీ..ఎర్టిగా, బాలెనో వాహన ధరలను 1.4 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ రెండు మాడళ్లలో భద్రత ప్రమాణాలను మెరుగుపర్చడంలో భాగంగా ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను నెలకొల్పింది. దీంతో వీటి ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో రూ.6.7 లక్షల నుంచి రూ.9.92 లక్షల లోపు, ఎర్టిగా రూ.8.97 లక్షల నుంచి రూ.13.25 లక్షల లోపు లభించనున్నాయి

# ఐవోబీ వడ్డీరేట్ల తగ్గింపు

ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) రుణగ్రహీతలకు శుభవార్తను అందించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ని పది బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్(ఐవోబీ) రుణగ్రహీతలకు శుభవార్తను అందించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్-బేస్డ్ లెండింగ్



రేటు(ఎంసీఎల్ఆర్)ని పది బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. తగ్గించిన రేట్లు వెంటనే అమలులోకి రానున్నట్లు బ్యాంక్ వెల్లడించిందిబ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఒక్కరోజు కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటును 8.25 శాతం నుంచి 8.15 శాతానికి దించిన సంస్థ..నెల రోజుల రుణాలపై ఎంసీఎల్ఆర్ 8.40 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఇది 8.50 శాతంగా ఉన్నది. అలాగే మూడు, ఆరు, ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై పది బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో వడ్డీరేట్లు వరుసగా 8.55 శాతం, 8.80 శాతం, 9 శాతానికి దిగొచ్చాయి

# చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం..




సోషల్ మీడియా ద్వారా యూజర్లు ఫిర్యాదు ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌బాట్ సవల్లో అంతరాయం ఏర్పడింది. సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. చాట్‌బాట్‌ను ఓపెన్ చేస్తుంటే.. ఎర్రర్ మెసేజ్‌లు వస్తున్నాయి. చాట్ హిస్టరీ లోడ్ అవ్వట్లేదు. దీనిపై యూజర్లు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు.డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. భారత్ సహా ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని యూజర్లు ఈ సమస్యలు ఎదుర్కొన్నారు. దాదాపు 82 శాతం మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలు పొందలేకపోతున్నారు. మొబైల్ యాప్, వెబ్ రెండింటిలోనూ ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అంతేకాదు లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలు కూడా ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేస్తున్నారు. తాజా సమస్యపై 'ఓపెన్‌ఏఐ సంస్థ స్పందించింది. సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. చాట్‌జీపీటీ రికార్డ్ మోడ్, సోరా, కోడెక్స్ వంటి సేవల్లో అంతరాయం ఉన్నట్లు తెలిపింది

# యూజర్లకు గుడ్‌న్యూస్.. త్వరలో కొత్త సపోర్ట్ చాట్ ఫీచర్‌ను తీసుకురానున్న వాట్సాప్..!



ఐఓఎస్ యూజర్లకు వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్పెషల్ సపోర్ట్ చాట్ ద్వారా ఏఐ యూజర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నది. ఈ కొత్త ఫీచర్ వాట్సాప్ యాప్ తాజా వెర్షన్‌లోకి రాగా.. రాబోయే వారాల్లో మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఐఓఎస్ యూజర్లకు వాట్సాప్ మరో కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్పెషల్ సపోర్ట్ చాట్ ద్వారా ఏఐ యూజర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వనున్నది. ఈ కొత్త ఫీచర్ వాట్సాప్ యాప్ తాజా వెర్షన్‌లోకి రాగా.. రాబోయే వారాల్లో మిగతా యూజర్లందరికీ అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ సపోర్ట్ చాట్ కోసం మొదట వాట్సాప్ సెట్టింగ్‌లోకి వెళ్లాలి. అందులో హెల్ప్ బటన్‌పై క్లిక్ చేయాలి. అందులో హెల్ప్‌సెంటర్ బటన్‌పై క్లిక్ చేస్తే కాంటాక్ట్ అస్ పై క్లిక్ చేసి యాక్సెస్ చేయొచ్చు. దాంతో యూజర్లు అధికారిక వాట్సాప్ సపోర్ట్ ఖాతా అని సూచించే మెటా వేరిఫైడ్ బ్లూ టిక్‌తో కొత్త చాట్ విండో ఓపెన్ అవుతుంది.ఈ చాట్‌లో యూజర్లు అడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇస్తుంది. ఈ సమాధానాలన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మాత్రమే జనరేట్ చేస్తుంది. అయితే, ఈ సమాధానాల్లో కొన్ని తప్పు, లేదా అనుచిత సమాచారం ఉండవచ్చని నోటిఫికేషన్ వస్తుంది. ప్రతి సమాధానం కిందట %వీమ్ఘ ־ూ×% ఇండికేటర్, టైమ్‌స్టాంప్ సైతం ఉంటుంది. వినియోగదారులు తమ సమస్యలను నేరుగా టెక్స్ట్ ద్వారా, స్క్రీన్‌షాట్స్‌ల ద్వారా పంచుకోవచ్చు. రెస్పాన్స్ సైతం వేగంగా ఉంటుంది. ప్రతి చాట్‌కు ఒక సపోర్ట్ టికెట్ నెంబరు కూడా ఇస్తారు. ఈ ఫీచర్ తరచుగా అడిగే ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఉపయోగపడుతుంది. వినియోగదారుడు మానవ సహాయం కోరితే.. సహాయక సిబ్బంది జోక్యం చేసుకుంటారని పేర్కొంటూ యూజర్లకు ఓ ఆటోమేటెడ్ సందేశం కనిపిస్తుంది.

# లక్షకు చేరువలో పుత్తడి



బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా ధరలు పుంజుకుంటున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ పదిగ్రాముల ధర రూ.710 అధికమై రూ.99 వేల నుంచి రూ.99,710కి చేరుకున్నది. హైదరాబాద్, జూలై 12: బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా ధరలు పుంజుకుంటున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ పదిగ్రాముల ధర రూ.710 అధికమై రూ.99 వేల నుంచి రూ.99,710కి చేరుకున్నది.అలాగే 22 క్యారెట్ కలిగిన గోల్డ్ ధర రూ.650 అధికమై రూ.91,400 పలికింది. అంతకుముందు ఇది రూ.90,750గా ఉన్నది. బంగారంతోపాటు వెండి ధరలు భారీగా పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో కిలో వెండి రూ.4 వేలు అధికమై రూ.1.25 లక్షలకు చేరుకున్నది

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శనివారం 19 - 07 - 2025



# కింగ్‌డమ్ హీరోకు డెంగ్యూ.. ఆస్పత్రిలో విజయ్ దేవరకొండ !

ఫిల్మ్ స్టార్ విజయ్ దేవరకొండ ఆస్పత్రిలో చేరాడు. అతను డెంగ్యూతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈనెల 20వ తేదీన అతను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు. విజయ్ దేవరకొండ కానీ ఇతర సభ్యులు ఎవరూ ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. దేవరకొండ నటించిన కొత్త చిత్రం కింగ్‌డమ్ ఈనెల 31వ తేదీన రిలీజ్ కానున్నది. కింగ్‌డమ్ చిత్రాన్ని గౌతం తిన్ననూరి డైరెక్ట్ చేశాడు. ఆ ఫిల్మ్‌లో భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్ నటిస్తున్నారు. సీతార ఎంటర్‌టైన్మెంట్స్, ఫార్చ్యూనర్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై ఆ మూవీని రిలీజ్ చేస్తున్నారు. పూర్తి స్థాయి కమర్షియల్ ఫిల్మ్‌గా కింగ్‌డమ్‌ను రూపొందించారు. వాస్తవానికి మార్చి 30న రిలీజ్ కావాల్సిన ఆ సినిమాను పోస్టు ప్రొడక్షన్ సమస్య వల్ల వాయిదా వేశారు. కింగ్‌డమ్ ఫిల్మ్‌కు చెందిన హిందీ వర్షన్‌ను థియేటర్లలో కాకుండా నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న డాన్ 3 చిత్రంలో విలన్ పాత్రలో విజయ్ దేవరకొండ పోషించనున్నట్లు తెలుస్తోంది. ఫర్హాన్ అక్తర్‌కు సంబంధించిన ఆ ఫిల్మ్‌లో విక్రాంత్ మాసే స్థానంలో దేవరకొండకు ఛాన్స్ దక్కినట్లు కొన్ని రూమర్స్ వినిపిస్తున్నాయి.

# అమ్మాయి పోస్టర్ చూడగానే అందరూ పారిపోతారు

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో వస్తోన్న చిత్రం పరదా. లేడీ ఓరియంటెడ్ మూవీగా వస్తోన్న ఈ సినిమాకు ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంగీత, దర్శనా రాజేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా వచ్చే నెల ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్‌కు ఇంకా నెల రోజుల సమయం ఉండగానే మేకర్స్ ప్రమోషన్స్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే ఈ సినిమా నుంచి ఓ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు హాజరైన అనుపమ పరమేశ్వరన్ తన సినిమా గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఒక అమ్మాయి లీడ్ రోల్‌గా సినిమా పోస్టర్ చూస్తే అందరూ కూడా వెనక్కి వెళ్లిపోతారని అనుపమ తెలిపింది. అది ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఓటీటీతో పాటు ఆడియన్స్ కూడా కావొచ్చని పేర్కొంది. అయితే అది తప్పని నేను చెప్పట్లేదు..అదే రియాలిటీ అని అనుపమ వెల్లడించింది. ఆ రియాలిటీ నుంచే వచ్చిన సినిమా పరదా అని.. మా సినిమా దాదాపు ఏడాది క్రితమే పూర్తయిందని అనుపమ పరమేశ్వరన్ చెప్పుకొచ్చింది. మా సినిమా రిలీజ్ డేట్ కోసం చాలా కష్టపడ్డామని.. చివరికీ ఆగస్టు 22న మీ ముందుకు వస్తున్నామని తెలిపింది.






# తెలుగులోకి రాబోతున్న తమిళ సూపర్‌హిట్ ‘మై బేబీ’.. ఆసక్తికరంగా ట్రైలర్

ఇటీవల తమిళంలో విడుదలై భారీ విజయం సాధించిన ‘%ణచీూ%’ చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది. ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత సురేష్ కొండేటి ఈ చిత్రాన్ని ‘మై బేబి’ పేరుతో ఈనెల జూలై 18న థియేటర్లలో విడుదల చేయబోతున్నారు. నెల్సన్ వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిమిషా సజయన్, అథర్వ మురళి కీలక పాత్రల్లో నటించారు. గతంలో ‘ప్రేమిస్తే’, ‘జర్నీ’, ‘షాపింగ్ మాల్’, ‘పిజ్జా’ వంటి విజయవంతమైన అనువాద చిత్రాలను అందించిన సురేష్ కొండేటి, ‘మై బేబి’తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ సినిమా విడుదలకు ఒక్కరోజే ఉండడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హాస్పిటల్ మాఫియా ఆధారంగా తెరకెక్కినట్లు తెలుస్తుంది. ఈ చిత్రం ఆనంద్ (అథర్వ), దివ్య (నిమిషా సజయన్) అనే జంట చుట్టూ తిరుగుతుంది. ఆనంద్ తన లవ్ ఫెయిల్ అవ్వడం వలన మందుకి బానిసగా మారతాడు. దివ్య బోర్డర్‌లైన్ పర్సనాలిటీ డిజార్డర్ అనే మానసిక సమస్యతో బాధపడుతూ ఉంటుంది. వీరిద్దరికి అనుకోకుండా పెళ్లి జరుగుతుంది. అయితే ఆనంద్ దివ్య మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని, ఆమెను ప్రేమిస్తాడు. వారిద్దరూ సంతోషంగా జీవిస్తారు. ఈ క్రమంలోనే దివ్య గర్భవతి అవుతుంది, వారికి ఒక బాబు పుడతాడు. అయితే, బిడ్డ పుట్టిన కొన్ని నిమిషాలకే, ఆ బిడ్డ తమది కాదని, ఎవరో ఆసుపత్రిలో మార్చేశారని దివ్య పదేపదే చెబుతుంది. ఆమె మానసిక స్థితి కారణంగా మొదట ఎవరూ ఆమె మాటలు నమ్మరు. కానీ ఆనంద్ తన భార్య మాటలను నమ్మి, నిజం తెలుసుకోవడానికి బయలుదేరతాడు. ఆనంద్ తన బిడ్డను కనుగొనడానికి వెళ్లిన క్రమంలో పిల్లలను కిడ్నాప్ చేసి అమ్ముకునే ఒక పెద్ద నెట్‌వర్క్‌ను కనుగొంటాడు. అయితే ఈ నెట్‌వర్క్‌ని నడిపిస్తుంది ఎవరు. ఆనంద్ ఈ నెట్‌వర్క్‌ని ఎలా కనిపెట్టాడు. దివ్య తనకి పుట్టిన బిడ్డని మార్చేశారు అని ఎలా తెలుసుకుంటుంది అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.



## సత్యదేవ్ కోటి రూపాయల ఆర్టిస్ట్.. ఆ మార్క్ ఎప్పుడో దాటేశాడు!

టాలెంట్ ఆర్టిస్ట్ సత్యదేవ్ మొదట్లో హీరో స్నేహితుడి పాత్రలు చేసేవాడు. తర్వాత విలనిజం చేశాడు. అలాగే హీరోగానూ సినిమాలు చేస్తున్నాడు. ఆ మధ్య ఆర్ఆర్ఆర్ సినిమాలోనూ యాక్ట్ చేశాడు. కానీ ఎడిటింగ్‌లో తను కనిపించే దాదాపు 16 నిమిషాల సీన్లను లేపేశారు. కావాల్సినంత ప్రతిభ ఉన్నా.. ఎందుకో కాస్త వెనకబడుతున్నాడు. ఇతడు చివరగా నటించిన జీబ్రా కూడా బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని అందుకోలేకపోయింది.

**నేనప్పుడే చెప్పా..**

కానీ సత్యదేవ్ దమ్మున్న నటుడని మాత్రం పేరు సంపాదించుకున్నాడు. ప్రస్తుతం ఇతడు కింగ్‌డమ్ మూవీలో విజయ్ దేవరకొండ సోదరుడిగా నటిస్తున్నాడు. అలాగే సత్యదేవ్ చేతిలో ఫుల్ బాటిల్, గరుడ: చాప్టర్ 1 చిత్రాలున్నాయి. తాజాగా ఇతడు పరదా సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌కు హాజరయ్యాడు. ఈ క్రమంలో నిర్మాత విజయ్ డొంకాడ.. సత్యదేవ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశాడు. సత్యతో 47 డేస్ సినిమా చేశాను. భయ్యా.. నువ్వు త్వరలోనే కోటి రూపాయల ఆర్టిస్టువి అవుతావు అని ఆ సినిమా షూటింగ్‌లోనే అన్నాను.

**చాలా టాలెంట్**

ఆ రూ.1 కోటి మార్కు ఆయన ఎప్పుడో దాటేశారు. సత్య చాలా టాలెంటెడ్ ఆర్టిస్ట్. ఆయన నాకు ఫ్యామిలీ మెంబర్‌లానే అనిపిస్తాడు అని చెప్పుకొచ్చాడు. పరదా సినిమా విషయానికి వస్తే.. ఇందులో అనుపమ ప్రధాన పాత్రలో నటించింది. ‘సినిమా బండి’ ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వం వహించగా విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. ఆగస్టు 22న పరదా విడుదల కానుంది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332